RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:213 మంగళవారం 06 సెప్టెంబర్ 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098

## ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు

- నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు
- 22ఏపై చర్చకు సిద్ధంగా ఉన్నాం
- సభ సజావుగా సాగేందుకు సహకరించాలి
- 22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ
- వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి

2





3

## ముగిసిన బీఏసీ సమావేశాలు

- 12 వరకు అసెంబ్లీ సమావేశాలు
- బీఏసీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్



## మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దుశ్శాసనపర్వం

- సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారు
- సబితా ఇంద్రారెడ్డి జుట్టుపట్టుకొని వ్యాన్‌లో ఎక్కించారు
- పలు విమర్శలకు దారితీసిన పోలీసుల ప్రవర్తన
- ప్రభుత్వ వైఖరిపై రాష్ట్రవ్యాప్త ఆందోళనకు బీఆర్ఎస్ పిలుపు

3

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

- రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

2





# స్పీకర్‌పై దూషణలు తగవు

- ఇది సభా గౌరవానికి సంబంధించిన విషయం
- బీఆర్ఎస్ క్షమాపణ చెప్పి ఆ సభ్యుడితో రాజీనామా చేయించాలి
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2





## కార్పొరేషన్లలో ఇందిరమ్మ టవర్స్

- గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం
- 20లోగా రెండో విడత ఇళ్ల మంజూరు
- రూ.230కే సిమెంట్ బస్తా.. త్వరలో రాయితీపై ఇనుము
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

2



## నీటి కష్టాలకు కేసీఆర్ వైఫల్యాలే కారణం

- రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినా అసంపూర్తిగానే నీటి ప్రాజెక్టులు
- పాలమూరు–రంగారెడ్డి 90 శాతం పనులు పూర్తయ్యాయనడం అబద్ధం
- శాస్త్రీయ పద్ధతుల్లో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

2



## మహిళా ఎమ్మెల్యేలపై దాడికి సీఎందే బాధ్యత

- సభలో క్షమాపణ చెప్పే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

## నా వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావు

- శాసనసభ ఘటనపై తాతా మధు వివరణ

2



## 'మారుపేర్ల' సమస్య పరిష్కరిస్తాం

- శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

3

## ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఆటో చార్జీల పెంపునకు ప్రభుత్వం సానుకూలం
- ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలు నడిపే ప్రసక్తే లేదు
- ఓలా, ఉబెర్ తరహాలో ప్రత్యేక యాప్ కోసం ఐటీ శాఖతో సంప్రదింపులు
- 18,700 ఆటోల రెట్రోఫిట్మెంట్‌కు ఒక్కో ఆటోకు రూ. 1.50 లక్షల సాయం: మంత్రులు ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి

3





## ఫీజు బకాయిలు చెల్లించేదాకా పోరు ఆగదు

- గోల్కొండ పిఎస్ నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు హెచ్చరిక
- మహా ధర్నాకు అనుమతి నిరాకరించినందుకే అసెంబ్లీ ముట్టడి
- పోలీసుల తోపులాటలో గాయపడ్డ పలువురు నాయకులు
- ఐసీయూలో అమీర్‌పేట్ కార్పొరేటర్ సరళ

3

## అసెంబ్లీని ముట్టడించిన నిరుద్యోగులు

- గేటు లోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 7 :

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వేళ నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు అసెంబ్లీని ముట్టడించారు. అసెంబ్లీ ప్రధాన గేటు వద్దకు చేరుకున్న వారు

మిగతా 3వ పేజీలో..



## నా వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7:**

శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వివరణ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి తాను మాట్లాడని మాటలను తనకు ఆపాదిస్తున్నారని పేర్కొంటూ ఈ విషయంపై తన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక కీలక ప్రకటన చేశారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో మహిళా శాసనసభ్యులతో పాటు తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తోపులాట, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ క్రమంలో తనపై కూడా దాడి జరిగిందని, తన షర్టు, ఫ్యాంటు లాగేందుకు, గొంతు నొక్కేందుకు ప్రయత్నించినట్లు అనిపించిందని పేర్కొన్నారు. కొంతమంది తనను దుర్భాషలాడినట్లు తెలిపారు. ఈ పరిణామాలతో తీవ్ర ఆవేదనకు గురై తనపై దాడి చేసింది ఎవరు.. తన షర్టు లాగేందుకు ఎవరు ప్రయత్నించారు.. అలా చేయమని ఎవరు ఆదేశించారు అంటూ తాను ప్రశ్నించానన్నారు. అయితే ఈ వ్యాఖ్యలను స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవిగా భావించడం సరికాదని స్పష్టం చేశారు. స్పీకర్ వ్యవస్థ పట్ల, వ్యక్తిగతంగా స్పీకర్ పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని మధు చెప్పారు. స్పీకర్‌ను ఉద్దేశించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఒకవేళ తన వ్యాఖ్యల్లో ఏదైనా స్పీకర్‌ను ఉద్దేశించినట్లు భావిస్తే ఆ మాటలను ఉపసంహరించుకుంటున్నానని, అందుకు విచారం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. శాసనసభలోకి వచ్చే సమయంలో తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా శాసనసభ్యులతో తోపులాట జరిగిందని, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమ సీనియర్ నాయకులను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారని తెలిపారు. ప్రజాప్రతినిధులతో వ్యవహరించే విషయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శాసనసభ్యులపై జరిగినట్లు పేర్కొన్న పరిణామాలపై ప్రభుత్వం స్పందించాలని మధు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను మాట్లాడిన వ్యాఖ్యలపై ఏర్పడిన వివాదం కంటే శాసనసభలో చోటుచేసుకున్న అసలు పరిణామాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మధు వ్యాఖ్యానించారు. ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన ఘటనలపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కార్పొరేషన్లలో 'ఇందిరమ్మ టవర్స్'

**హైదరాబాద్, సెప్టెంబర్ 7:**

గ్రామీణ ప్రాంతాల్లో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నట్లుగానే పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదల సొంతింటి కలను కూడా సాకారం చేస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనమండలిలో ఇందిరమ్మ ఇళ్లపై సభ్యులు సోమవారం అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. స్థలాల కొరతను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ తరహాలోనే నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర మున్సిపల్ కార్పొరేషన్లలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడంతోపాటు పొదుపు మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష వరకు అడ్వాన్స్ రుణం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

**కేంద్రం నుంచి ఆశించిన సహకారం లేదు**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందడం లేదని మంత్రి పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు లక్షలాది ఇళ్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం,తెలంగాణకు మాత్రం ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తాను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన రాలేదని తెలిపారు.

**దసరా నాటికి 2 లక్షల ఇళ్లు పూర్తి**

రాష్ట్రంలో తొలి విడతలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, 3,75,750 ఇళ్లకు కలెక్టర్లు మంజూరు పత్రాలు అందజేశారని, 3,28,070 ఇళ్లు గ్రౌండ్ అయినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 1,97,537 ఇళ్లు పూర్తయ్యాయని, దసరా నాటికి 2 లక్షల ఇళ్లను పూర్తి చేస్తామని ప్రకటించారు. నియోజకవర్గానికి 2,000 చొప్పున రెండో విడతలో మంజూరు చేసిన 2.50 లక్షల ఇళ్ల ప్రక్రియను ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

**రాయితీపై సిమెంట్, స్టీల్**

పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు బస్తా సిమెంట్‌ను రూ.230కే సరఫరా చేస్తున్నామని, త్వరలో పరిశ్రమల శాఖ మంత్రితో కలిసి స్టీల్ పరిశ్రమల యజమానులతో మాట్లాడి రాయితీపై స్టీల్ అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన 2బీ హెచ్‌కే ఇళ్లను పూర్తి చేసి అవసరమైన మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందిస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## నీటి కష్టాలకు కేసీఆర్ వైఫల్యాలే కారణం

**హైదరాబాద్, సెప్టెంబర్ 7:**

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న నీటి సమస్యకు ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు కారణమైతే మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగంలో చోటుచేసుకున్న వైఫల్యాలే ప్రధాన కారణమని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభ లాబీల్లో సోమవారం మీడియా ప్రతినిధులతో చిట్ చాట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రకృతి సృష్టించిన ప్రతికూల పరిస్థితులకు గత ప్రభుత్వ అసమర్థ సాగునీటి విధానాలు తోడవడంతోనే రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చిందన్నారు. తెలంగాణ రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఇద్దరే కారణం.. ఒకరు మిస్టర్ ఎల్‌నినో, మరొకరు మిస్టర్ కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంపై సుమారు రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పుకున్నప్పటికీ రాష్ట్ర ఆవిర్భావ సమయానికి పెండింగ్‌లో ఉన్న ప్రధాన ప్రాజెక్టులలో ఒక్కదానినీ పూర్తి చేయలేకపోయారని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, ఎస్ఎల్‌బీసీ సొరంగం వంటి కీలక ప్రాజెక్టులు భారీగా నిధులు వెచ్చించినప్పటికీ అసంపూర్తిగానే మిగిలాయన్నారు. సాగునీటి ప్రయోజనాలకు అనుగుణంగా ఫలితాలు సాధించకుండా ఆర్ఈసీ, పీఎఫ్‌సీ వంటి సంస్థల నుంచి అధిక వడ్డీలకు భారీ రుణాలు తీసుకున్నారని, ఆ అనాలోచిత అప్పుల భారాన్ని చివరకు ప్రజలే మోయాల్సి వస్తోందని అన్నారు.

**పాలమూరు–రంగారెడ్డిపై బీఆర్ఎస్‌వి తప్పుడు ప్రచారాలు**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రచారాన్ని మంత్రి ఉత్తమ్ తీవ్రంగా తప్పుబట్టారు. సుమారు రూ.27,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ పొలాలకు నీటిని చేర్చే డిస్ట్రిబ్యూటరీ కాలువల వ్యవస్థను నిర్మించలేదని తెలిపారు. కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా నామమాత్రంగానే జరిగిందని, అటువంటిది ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశామని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. నీటి వనరును జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల అంతర్రాష్ట్ర సమస్యలు కొనితెచ్చుకున్నారని తెలిపారు.

**కాళేశ్వరానికి ప్రజలను తీసుకెళ్లి ఏం చూపిస్తారు?**

కాళేశ్వరం ప్రాజెక్టుపై భారీ జనసమీకరణకు కేసీఆర్ సిద్ధమవుతున్నారనే ప్రచారాన్ని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయి, ప్రాజెక్టు నిర్మాణ భద్రతే ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో అక్కడికి ప్రజలను తీసుకెళ్లి ఏం చూపిస్తారని ప్రశ్నించారు. మీ ప్రభుత్వ హయాంలో రూపకల్పన చేసి, నిర్మించిన ప్రాజెక్టు దెబ్బతిన్న దృశ్యాలను చూపించడానికే ప్రజలను తీసుకెళ్తారా అని నిలదీశారు. నిపుణుల పరిశీలనల్లో కాళేశ్వరం బ్యారేజీల పునాదులు, నిర్మాణ వ్యవస్థలకు సంబంధించి తీవ్రమైన లోపాలు వెలుగుచూశాయని, దేశీయ, అంతర్జాతీయ నిపుణుల సలహాలతో దీర్ఘకాలిక భద్రతకు అవసరమైన పునరుద్ధరణ చర్యలను ప్రభుత్వం రూపొందిస్తోందని మంత్రి ఉత్తమ్ చెప్పారు.

**నదీజలాల హక్కుల పరిరక్షణలో రాజీలేదు**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన మూడు జల సంవత్సరాల్లో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన కృష్ణా జలాలను సమర్థంగా వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

# స్పీకర్‌పై దూషణలు తగవు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :**

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టగా, స్పీకర్ ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది. ఈ వ్యాఖ్యలను ముఖ్యమంత్రి, మంత్రి సీతక్క తదితరులు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డిలు ఖండించారు. స్పీకర్ పదవి ఒక అత్యున్నత స్థానం.. సభాపతిని గౌరవించడం మన సంప్రదాయం.. అలాంటి స్పీకర్‌పై సభ్య సమాజం తల వంచుకునేలా కొంతమంది మాట్లాడారు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సభకు జరిగిన అవమానంగా భావించి సభ్యులు దీనిపై చర్చ పెట్టారన్నారు. సభా సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సభలో ముఖ్యమంత్రి అయినా, శాసనసభ్యుడు అయినా స్పీకర్‌కు సమానమేనని, అలాంటి స్పీకర్ మనసు గాయపడేలా బీఅరఎస్ వ్యవహరించిందని, ఇది వ్యక్తిగా గడ్డం ప్రసాద్ కుమార్‌కు జరిగిన ఘటన కాదు.. ఇది సభ గౌరవానికి సంబంధించిన విషయం అని అన్నారు. తెలంగాణకు ఇది ఒక చీకటి రోజు.. ఇంత అనుచిత భాషతో దూషించడం క్షమించరాని నేరం అని అన్నారు. సభాపతిని, ఆయన కుటుంబ సభ్యులను అవమానించేలా మాట్లాడారని, ఇది కేవలం దళితులకు జరిగిన అవమానం కాదు.. ఇది అందరికీ జరిగిన అవమానం అని పేర్కొన్నారు. తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తానని, దళితులకు మూడెకరాలు ఇస్తానని, దళిత బంధు ఇస్తామని నమ్మించి దళిత ఉప ముఖ్యమంత్రిని భర్తరఫ్ చేశారు.. నేరెళ్లలో ఇసుక లారీలను అడ్డుకున్న దళితులను లారీలతో తొక్కించి చంపారు.. ఒక దళితుడిని కాంగ్రెస్ సీఎల్పీ నాయకుడిని చేస్తే పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించి ప్రతిపక్ష హోదా నుంచి తొలగించారు అని బీఆర్ఎస్ హయాంనాటి ఘటనలను సీఎం గుర్తు చేశారు. బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక ఆలోచన.. దళిత వ్యతిరేక వైఖరి అని అన్నారు. సభాపతి తల్లిని అవమానించేలా మాట్లాడటం ఇది అందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నానంటూ ఈ వ్యాఖ్యలను మనందరం ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి దుర్మార్గపు పోకడలను నియంత్రించాలని కోరారు. ప్రభుత్వం సంయమనం పాటిస్తే ఆది చేతకానితనం అనుకుంటున్నారంటూ అదిరించి, బెదిరించి వ్యవస్థలను లొంగదీసుకుంటామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్ క్షమాపణ చెప్పాలని సభా నాయకుడిగా డిమాండ్ చేస్తున్నానన్నారు. ఆ సభ్యుడితో రాజీనామా చేయించాలని కూడా డిమాండ్ చేస్తున్నానన్నారు. అలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడి సభ్యత్వం బర్తరఫ్ చేయాలని కోరుతున్నానన్నారు.

**స్పీకర్ తల్లిపై అవమానీయంగా మాట్లాడారు : మంత్రి సీతక్క**

బీఆరఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తీరు సమాజం తల దించుకునేలా ఉందని, అసెంబ్లీ స్పీకర్ తల్లిపై అవమానీయంగా మాట్లాడడం బాధాకరం అని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ ఇద్దరు సభ్యులు తాత మధు, నవీన్‌లు మాట్లాడిన మాటలు తాను విన్నానని చెప్పారు. ఊర్లలో వీధులలో ప్రవర్తించే లాగా అసెంబ్లీల్లో ప్రవర్తించారని, వారిపై చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి అని స్పీకర్‌ను కోరారు. బీఆరఎస్ విధానం ఎలా ఉంది అంటే ఆ పార్టీ అధ్యక్షుడు నిన్ననే నీతులు మాట్లాడారు.. రెండున్నరేళ్లు అసెంబ్లీకి రాకుండా ఫాంహౌస్‌కే పరిమితం అయ్యారు.. సీఎంకి సంస్కారం లేదని తప్పుడు మాటలు మాట్లాడి వాళ్ళ సభ్యులకు ఎలాంటి సంస్కారం నేర్పించి పంపాడు అనేది దీన్నిబట్టి స్పష్టమవుతోందన్నారు. ఇది స్పష్టంగా కేసీఆర్ డైరెక్షనే అని ఆమె ఆరోపించారు. బీఆరఎస్ అంటేనే దురహంకారంతో ఉన్న పార్టీ అని, దళితులు అంటే వారికి నచ్చదు.. గతంలో భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా ఉంటే ఆ పదవి నుండి ఆయన్ను తొలగించే వరకు ఊరుకోలేదని, ఒక దళిత మహిళను ఏ విధంగా లాక్ అప్ డెత్ చేశారో తెలుసు.. నేరెళ్లలో దళితులను ఏం చేశారో తెలుసు.. రాజయ్యను రాత్రికి రాత్రికి తీసేశారు అంటూ బీఆర్ఎస్ నేతలకు దొర అహంకారం దురంకారం ఉన్నాయి అని ఆరోపించారు. ఆ తల్లి ఏం నేరం చేసింది అని ఇలా మాట్లాడారు అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉంది.. మంత్రులు ఉన్నారు సమాధానం చెప్పడానికి రండి అని కోరారు. గతంలో జగదీశ్వర్ రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి 'నీ సొత్తు కాదు' అని మాట్లాడారు.. సంస్కార హీనంగా మాట్లాడేవారు ముఖ్యమంత్రి రేవంత్ గురించి మాట్లాడతారని ఎద్దేవా చేశారు. స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధ స్థానంలో ఉన్న స్పీకర్‌పై మాట్లాడిన వారిని సస్పెండ్ చేయాలి, చర్యలు తీసుకోవాలి అని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

**తాతా మధును బర్తరఫ్ చేయాలి : బీజేఎల్పీ నేత ఏలేటి**

సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను బీజేపీ ఎమ్మెల్యేల తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన ఆ ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు జరిగిన తీవ్ర పరాభవంపై, మరోవైపు 22ఏ నిషిద్ధ భూముల వివాదంపై ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. 22ఏ భూముల్లో జరిగిన అక్రమాలపై స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డే క్షమాపణలు చెప్పారని, అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు సభలోనే స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసనను విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. 'ధరణి'పై నిజంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా అని నిలదీసిన ఆయన ఒకవేళ జరిగితే ఆ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# మహిళా ఎమ్మెల్యేలపై దాడికి సీఎందే బాధ్యత

- సభలో క్షమాపణ చెప్పే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టం
- వెయ్యి రోజుల వైఫల్యాలను ఎండగడతామనే భయంతోనే దాడులు
- దాడికి నిరసనగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం బహిష్కరణ
- హైకోర్టు, ఎస్సీ, ఎస్టీ, మహిళా, మానవ హక్కుల కమిషన్లను ఆశ్రయిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :**

శాసనసభ ప్రాంగణంలో మహిళా శాసనసభ్యులు, మాజీ మంత్రులు, సీనియర్ సభ్యులపై జరిగిన అక్రమ దాడి, దాష్టీకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముమ్మాటికీ బాధ్యత వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యేల చీరలు లాగడం, గొంతులు పట్టుకోవడం, జుట్టు లాగుతూ పోలీసులు దౌర్జన్యం చేయడం అత్యంత దుర్మార్గమని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం క్షమాపణ చెప్పే వరకు, దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే మహిళా శాసనసభ్యులపై దాడులు చేయిస్తోందని మండిపడ్డారు. నిరసన తెలిపే హక్కుతో టీషర్టులు ధరించి సభకు వస్తే అడ్డుకున్నారని, రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ఇలాంటి నిరసనలు తెలిపినప్పుడు లేని నిబంధనలు రాష్ట్రంలో కొత్తగా వచ్చాయా అని నిలదీశారు.

**వెయ్యి రోజుల వైఫల్యాల భయం**

కాంగ్రెస్ వెయ్యి రోజుల భ్రష్ట పాలన, 420 హామీలు, 6 గ్యారెంటీల అమలు వైఫల్యాలను అసెంబ్లీలో ఎండగడతామనే భయంతోనే ప్రభుత్వం పోలీసుల ద్వారా ఈ అరాచకానికి ఒడిగట్టిందని ఆరోపించారు. తమ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు అనని మాటలను ఆపాదించి ప్రధాన అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

**దళిత, మహిళా వ్యతిరేక ప్రభుత్వం**

కాంగ్రెస్‌కు నిజంగానే దళితులపై ప్రేమ ఉంటే అసెంబ్లీలో దళిత, గిరిజన డిక్లరేషన్లపై చర్చకు సిద్ధం కావాలని సవాలు విసిరారు. దళితబంధును ఎత్తివేసి అభయహస్తం కింద రూ.12 లక్షలు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.6 లక్షలు ఇస్తామన్న హామీలలో ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు.

**న్యాయపోరాటం విస్తృతం**

ప్రభుత్వ అరాచకాలకు నిరసనగానే బీఏసీ సమావేశాన్ని బహిష్కరించామని కేటీఆర్ తెలిపారు. ఎమ్మెల్యేలపై జరిగిన దాడిపై ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించామని, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. త్వరలోనే జాతీయ మహిళా కమిషన్, మానవ హక్కుల కమిషన్‌ల దృష్టికి కూడా ఈ ఉదంతాన్ని తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

# అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

- రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం
- ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు
- రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :**

శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్, సెప్టెంబర్7 :**

అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రారంభమైన వెంటనే నిషేధిత భూములు 22ఏ జాబితా వ్యవహారంపై సభలో రగడ మొదలైంది. 22 A నిషేధిత భూముల నిబంధన కింద ప్రైవేట్ భూముల నమోదుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. ఈ వివాదంపై తక్షణమే విచారణ కమిటీని వేయాలని ప్రభుత్వాన్ని పట్టుబట్టారు. ఈ ఆందోళనపై శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. 22A అంశంపై సభలో స్వల్పకాలిక చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందన్నారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ అంశానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనలకు అనుగుణంగా చర్చపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సభను అడ్డుకోవడం సరికాదని, సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు సర్దిచెప్పినప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గకుండా పోడియం వద్ద కాసేపు నినాదాలు చేశారు. విచారణకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటన చేసే వరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఆ తరువాత సభ ప్రారంభం కాగా బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని బయట వాళ్లు, లోపల వీళ్లు ఆందోళనకు దిగుతున్నారంటూ కాంగ్రెస్ సభ్యులు వ్యాఖ్యానించారు. సభలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్థవంతమైన చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై సభా సమయాన్ని వృధా చేస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సీల అభివృద్ధితోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, క్రీడల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా వాటిని వదిలేసి బురదజల్లే రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు తగదని అన్నారు. రాష్ట్రంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల కుంభకోణంపై విచారణ కోరుతూ ప్రభుత్వం ఏడాది క్రితమే కేంద్రానికి లేఖ రాసినా ఆ ఎంక్వయిరీని ఎందుకు తొక్కిపెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యేల్ని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో విచారణను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఆపుతున్నారో



సమాధానం చెప్పాలన్నారు. బీజేపీ సభ్యులు కూర్చోవాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ కోరారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలన్నారు. బీఏసీలో నిర్ణయం తీసుకుని 22ఏపై చర్చిద్దామని తెలిపారు.

**వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి**

వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని శాసనమండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని •••నిట్?గా తీసుకున్నట్లుగా వివరించారు. లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే సిమెంట్ ఇప్పిస్తామని చెప్పారు.పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తామని పొంగులేటి వెల్లడించారు. 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం హడావిడిగా కొంతమందికి పట్టాలిచ్చిందన్నారు. వారు ఇచ్చిన ఇళ్లలో చాలామంది నివసించట్లేదని చెప్పారు. పేదలు నివసించే ప్రాంతానికి 3040 కి.మీ దూరంలో ఇళ్లు ఇచ్చారని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివసించే వారిని అంటరాని వారిగా చూసేవారని ఆయన తెలిపారు.

# ఫీజు బకాయిలు చెల్లించేదాకా పోరు ఆగదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :**
పేద విద్యార్థులకు రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైఎం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. శాంతియుత ఆందోళనలపై పోలీసులు దాడి చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండించింది. అరెస్టులు, పోలీసు నిర్బంధాలకు ఎంతమాత్రం భయపడేది లేదని, రూ.15,000 కోట్ల ఫీజు బకాయిలు పూర్తిస్థాయిలో విడుదల చేసేదాకా తమ పోరాటం ఆగదని బీజేపీ స్పష్టం చేసింది. ఇందిరా పార్క్ వద్ద ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా చేసుకోవడానికి పోలీసు యంత్రాంగం అనుమతి నిరాకరించడంతో బీజేపీ శ్రేణులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఆందోళనలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావుతోపాటు పలువురు కీలక నాయకులు, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా ఈడ్చివేసి అరెస్టు చేశారు. అరెస్టయి గోల్కొండ పోలీస్ స్టేషన్ నిర్బంధంలో ఉన్న రామచందర్ రావు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే అక్కడే మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల హక్కుల కోసం ధర్నా చౌక్ వద్ద మహాధర్నాకు అనుమతి నిరాకరించినందుకే ప్రజాస్వామ్య పద్ధతిలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చామని స్పష్టం చేశారు. పోలీసుల తోపులాట, లాఠీచార్జ్ వల్ల పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గాయపడ్డారని రామచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో పాల్గొన్న అమీర్‌పేట్ కార్పొరేటర్ సరళను నిర్బంధించే క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుల్సుంపుర పోలీస్ స్టేషన్ సమీపంలోని హాస్పిటల్ ఐసీయూలో అత్యవసర చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇటీవల ఎనిమిది లక్షల మంది విద్యార్థుల సంతకాలతో వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నిస్తే సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని, సీఎస్‌ను కలవడానికి వెళ్లినా అరెస్టు చేశారని ఆయన మండిపడ్డారు. అఫ్జల్‌గంజ్, గోషామహల్, కంచన్‌బాగ్ తదితర ప్రాంతాల్లో 600 మందికి పైగా కార్యకర్తలను అక్రమంగా నిర్బంధించారని తెలిపారు. గోల్కొండ పీఎస్‌లో తమతోపాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్ రావు, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్ సహా 50 మంది నాయకులను ఉంచారని, ఫీజుల బకాయిలు విడుదల చేసే వరకు పోరాటం ఆగదని రామచందర్ తేల్చిచెప్పారు.

**సీఎం ఇంటి ముట్టడికి వెనుకాడం: బీజేవైఎం**
ప్రభుత్వ నిరంకుశ వైఖరిని మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను, బీజేవైఎం కార్యకర్తలను ఏకం చేసి నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటినే ముట్టడిస్తామని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే హెచ్చరించారు. రాజ్యాంగబద్ధంగా లభించిన నిరసన హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు.

**'చోటా హిట్లర్' పాలన సాగుతోంది : ఎంపీ డీకే అరుణ**
రాష్ట్రంలో నిరంకుశ, నిర్బంధ పాలన సాగిస్తున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రామచందర్ రావును అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో 'చోటా హిట్లర్' పాలన కొనసాగుతోందని, ప్రజల సమస్యలపై గళమెత్తితే అణచివేయడమే లక్ష్యంగా రాజ్యాంగ విరుద్ధమైన పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అక్రమ అరెస్టులకు బీజేపీ భయపడబోదన్నారు. ప్రభుత్వం వెంటనే రామచందర్ రావుతోపాటు ఇతర నాయకులను, విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే విద్యార్థుల పక్షాన బీజేపీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని అరుణ హెచ్చరించారు.

**ఇదేం ప్రజాస్వామ్యం రేవంత్ రెడ్డి..: ఎంపీ డాక్టర్ లక్ష్మణ్**
40 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, వివాదాస్పద 22ఏ నిషేధిత జాబితా నుంచి పేదల భూములను తొలగించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా అసెంబ్లీ ముట్టడికి నడుం బిగించిన తమ పార్టీ శ్రేణులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులతో ఉక్కుపాదం మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా పోరాడుతున్న రామచందర్ రావును అసెంబ్లీ వద్ద అక్రమ అరెస్టు, పలువురు రాష్ట్ర నాయకులు, బీజేవైఎం కార్యకర్తలను నిర్బంధించడం దారుణమన్నారు. పోలీసుల తోపులాటలో మహిళా నాయకురాలు, అధికార ప్రతినిధులు గాయపడటం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఇందిరా పార్కు వద్ద శాంతియుతంగా ధర్నా చేసుకుంటామంటే అనుమతి నిరాకరించిన ప్రభుత్వం తమ గోడు చెప్పుకోవడానికి అసెంబ్లీ వైపు వస్తే లాఠీలతో, పోలీసులతో అణచివేయాలని చూడటం దుర్మార్గమన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఏ విధంగా అయితే పోలీసులను అడ్డం పెట్టుకుని పాలించిందో నేడు రేవంత్ సర్కార్ అంతకు మించి అరాచకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో, పోలీసుల నిర్బంధాలతో తమ గొంతును నొక్కలేరనేది రేవంత్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన తమ పార్టీ నేతలను, కార్యకర్తలను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని, 22ఏ దందాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రజాస్వామ్య పాలన నడవడట్లేదు : రాణి రుద్రమ**
తమ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు విచక్షణారహితంగా దాడులకు తెగబడటంపై బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్.గౌతం రావు, వీరేందర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, మహిళా నాయకురాలు, కార్పొరేటర్ సరళ, జనగామ జిల్లా అధ్యక్షుడు రమేష్, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించినందుకు అరెస్టులు చేస్తారా అని రేవంత్ రెడ్డిని ఆమె నిలదీశారు. హిట్లర్ లాగా నియంతృత్వ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఫీజుల కోసం రెండు రోజులపాటు రామచందర్ రావు దీక్ష చేపట్టినా ప్రభుత్వంలో స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల దాడిలో కార్పొరేటర్ సరళకి తీవ్ర గాయాలైతే ఐసీయూలో చేర్చారని, పద్మ గౌడ్ కి తీవ్ర గాయాలయ్యాయని, స్పృహ కోల్పోవడంతో జనగామ జిల్లా అధ్యక్షుడిని ఐసీయూలో అడ్మిట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. యువమోర్చా ఆడపిల్లలని విచక్షణారహితంగా కొట్టారని, పార్టీ నాయకురాలు జయశ్రీ తోపాటు ఇతర ముఖ్య నాయకులను గొర్రెల మందను ఈడ్చుకెళ్లినట్లు వ్యాన్లలో తోసి స్టేషన్లలో పడేశారని మండిపడ్డారు.

# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దుశ్శాసనపర్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 7:**
అసెంబ్లీ సమావేశాల వేళ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర చర్చకు దారి తీసింది. అసెంబ్లీకి వస్తున్న మహిళా ప్రజాప్రతినిధులని కూడా చూడకుండా పోలీసులు కర్కశంగా వ్యవహరించారు. అసెంబ్లీ లోపలికి వెళ్తున్న సమయంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడంతో తీవ్ర ఆవేదనకు గురైన ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. అదే సమయంలో మహిళా సభ్యులను అరెస్టు చేసే క్రమంలో సబితా ఇంద్రారెడ్డిని జుట్టు పట్టుకుని బలవంతంగా వాహనంలోకి ఎక్కించారు. మహిళా ఎమ్మెల్యేలు అనే కనీస గౌరవం కూడా లేకుండా పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజల తరపున అసెంబ్లీకి హాజరయ్యేందుకు వచ్చిన మహిళా ప్రజాప్రతినిధులనే ఇలా అవమానించడం ఏమిటని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. సునీత చీరను పోలీసులు లాగిన సమయంలో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజు : సునీత**
అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజు అని సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే మహిళలకు భద్రత లేదని.. శాసనసభలో కూడా భద్రత లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. తాము నల్లటి టీషర్ట్ కూడా ధరించలేదు. అయినా తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నిస్తే పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని అన్నారు. ఇదేనా ప్రజాపాలనలో మహిళలకు దక్కే గౌరవమని ప్రశ్నించారు. నిరసన చేయడానికి తమకు హక్కు లేదా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మహిళలు అని కూడా చూడకుండా ఇష్టానుసారంగా తోసేస్తున్నారని మండిపడ్డారు. వెయ్యి రోజుల పాలన గురించి కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారు కానీ అసలు నిజాలు తెలుస్తాయనే తమను అసెంబ్లీకి రానివ్వడం లేదని ఆరోపించారు. కాగా, అసెంబ్లీ ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పోలీసులు వ్యవహరించిన తీరును ఆ పార్టీ తీవ్రంగా ఖండించింది. తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిరసనగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ ఆందోళనలు చేపట్టాలని బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించింది.

**కేటీఆర్, హరీశ్‌రావు అరెస్ట్**
**-అసెంబ్లీ మెయిన్ గేట్ వద్ద ఉద్రిక్తత**
అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్త వాతావరణ నెలకొంది. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన వైఫల్యాన్ని నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, ఎమ్మెల్యేల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. వారిని బలవంతంగా వాహనంలోకి ఎక్కించి తెలంగాణ భవన్‌కు తరలించారు. నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీ రావడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్న క్రమంలో తోపులాట జరిగింది. ఈ ఘటనలో జగదీశ్ రెడ్డి కింద పడటంతో అతని కాలికి గాయమైంది. పోలీసుల తోపులాటలో కేటీఆర్ చేతికి, నుదుటికి గాయాలయ్యాయి. పోలీసులతో జరిగిన తోపులాటలో హరీశ్‌రావు కిందపడ్డారు. ఆ సమయంలో పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు. ఆయన చేతిని తొక్కారు. ఈ ఘటన అనంతరం నల్ల టీషర్టులతో అసెంబ్లీ లోపలికి అనుమతించకపోవడంతో హరీశ్‌రావు టీషర్ట్ విప్పి బనియన్‌తో నిరసన తెలిపారు. అనంతరం అసెంబ్లీ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ వరుస ఘటనలతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :**
రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి తెలిపారు. ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులు సుదీర్ఘంగా సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత నెల 23న జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను కూడా ఈ సందర్భంగా సమీక్షించారు. వైట్ ప్లేట్ వాహనాలు, బైక్ టాక్సీల వినియోగంపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు రవాణా శాఖ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతర జిల్లాలకు చెందిన ఆటోలు హైదరాబాద్ నగరంలో తిరగకుండా నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని, దీనికి కార్మిక సంఘాలు సహకరించాలని కోరారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కార్మిక శాఖతో కలిసి ప్రాధాన్యతా ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని, ఈ అంశాన్ని కేబినెట్‌లో చర్చించి శాసనసభలో బిల్లు ప్రవేశపెడతామని తెలిపారు. ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టి లాస్ట్ మైల్ కనెక్టివిటీ పాలసీ తీసుకురానున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి విధానంపై ఎలాంటి చర్చ జరగడం లేదన్నారు.

**ఆటో చార్జీల పెంపునకు సానుకూలం**
2012 తర్వాత ఆటో చార్జీలను పెంచలేదని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొన్నం చెప్పారు. అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి నివేదిక ఆధారంగా త్వరలోనే చార్జీల పెంపును అమలు చేస్తామన్నారు. ఆటో డ్రైవర్లకు ఉపయోగపడేలా ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ప్రత్యేక యాప్ రూపొందించే అంశంపై ఐటీ శాఖ మంత్రికి లేఖ రాశామని చెప్పారు.

**పెండింగ్ పర్మిట్లకు పరిష్కారం**
జీఓ నం.263 కింద తిరస్కరించిన కేసులు, గడువు ముగిసిన పర్మిట్లకు సంబంధించిన ఆటో రిక్షా పర్మిట్ కోటాను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎల్ఎంవీ లైసెన్స్ ఉన్న వారికి ఆటో నడిపే విషయంలో ఉన్న నిబంధనలను సవరించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

**18,700 ఆటోలకు ఆర్థిక సాయం**
నగరంలో డీజిల్, పెట్రోల్ ఆటోలను పర్యావరణహితంగా మార్చేందుకు (రెట్రోఫిట్మెంట్) సుమారు 18,700 ఆటోలకు ఒక్కో దానికి రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించామని, ఇందుకోసం సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. ఆటో డ్రైవర్లతోపాటు ఇతర వర్గాలకు కూడా భరోసా కల్పించేలా ప్రమాద, సహజ మరణ బీమా సదుపాయం కోసం ఇందిరమ్మ ప్రత్యేక బీమా పాలసీ తెచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. సమావేశంలో రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, అడిషనల్ కమిషనర్ రమేష్, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, వెంకట రమణ, పోలీసు, ట్రాఫిక్ అధికారులు, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అసెంబ్లీని ముట్టడించిన నిరుద్యోగులు

**మొదటిపేజీ తరువాయి**
ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అసెంబ్లీ గేటు లోపలికి చొచ్చుకెళ్లేందుకు నిరుద్యోగులు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. నిరుద్యోగులు వెంటనే కొత్త జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని నినదించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసు శాఖలో ఖాళీలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ప్రతిపాదించిన పోస్టులను 20 వేలకు పెంచాలని పోలీసు ఉద్యోగార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం 7,437 పోలీసు పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడంపై నిరుద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి లక్షలాదిగా నిరుద్యోగులు తరలిరావాలని నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు భారీగా నిరుద్యోగులు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



# 'మారుపేర్ల' సమస్య పరిష్కరిస్తాం

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :**
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 'మారుపేర్ల' సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ సిఫారసుల ఆధారంగా స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ అంశంపై శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ ఇది ఇటీవల ఉత్పన్నమైన సమస్య కాదని, 1990వ దశకంలో అనగా 1997 నుంచే సింగరేణిలో కొనసాగుతున్న పాత (లెగసీ) సమస్య అని వివరించారు. అధికారిక రిజిస్టర్‌లో ఒకరి పేరు ఉంటే, వారి స్థానంలో మరొకరు వచ్చి విధుల్లో పనిచేస్తున్న పరిస్థితులు ఉండేవని, ఒకరి పేరుపై మరొకరు ఉద్యోగం చేయడం చట్టప్రకారం తీవ్రమైన నేరమైనప్పటికీ కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకుని సింగరేణి యాజమాన్యం గతంలో మానవీయ కోణంలో పరిష్కరించేందుకు ప్రయత్నించిందని గుర్తు చేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ ఆ సమయంలో 45మంది అధికారులతోపాటు సంబంధిత వ్యక్తులపైనా చట్టబద్ధమైన చర్యలు తీసకున్నారన్నారు. సింగరేణిలో ప్రస్తుతం దాదాపు 90 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా ఈ మారుపేర్ల సమస్యను ఎదుర్కొంటున్న వారి సంఖ్య 128 మాత్రమేనని భట్టి విక్రమార్క తెలిపారు. ఇది పెద్ద సమస్య కానప్పటికీ చట్టపరమైన చిక్కులు ఉన్నందున అధికారులు ఈ సమస్యను పరిష్కరించేందుకు భయపడుతున్నారని చెప్పారు. ఒకవైపు నిబంధనల ప్రకారం భవిష్యత్తులో చర్యలు ఉంటాయనే అధికారుల భయం, మరోవైపు ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిడిని ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించిందని తెలిపారు. కార్మికులు చాలా ఏళ్లుగా అక్కడ పనిచేస్తున్నందున ఏ ఒక్క అధికారిపైనా భారం పడకుండా కమిటీ ద్వారా మానవీయ కోణంలో సమగ్రంగా పరిశీలించాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇప్పటికే నియమించిన కమిటీ నుంచి నివేదిక రాగానే ఆ 128మంది మారుపేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు.



# ముగిసిన బీఏసీ సమావేశాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :**
శాసనసభ, శాసనమండలి సమావేశాల నిర్వహణపై సోమవారం జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఉభయ సభలను ఈనెల 12 వరకు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. సమావేశాల పొడిగింపుపై అవసరమైతే మరోసారి సమీక్ష జరపాలని నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో ప్రధానంగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు అజెండా రూపొందించారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే బలాల హాజరయ్యారు. ఉదయం శాసనసభకు వెళ్తున్న తమపై పోలీసులు దౌర్జన్యం చేశారని నిరసిస్తూ బీఆర్ఎస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. బీఏసీ సమావేశంలో 22ఏ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్వల్పకాలిక చర్చలు జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇవాళ ఉదయం 22ఏ నిషేధిత భూముల జాబితాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. దీంతోపాటు మరో 22 కీలకమైన అంశాలపై చర్చ జరిపేందుకు కనీసం 15 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని ఏలేటి డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు మైనారిటీ అంశాలపైనా చర్చలు జరపాలని ఎంఐఎం నేత బలాలా సైతం కోరారు. ఈ నేపథ్యంలో ఎన్ని రోజులైనా సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సభలో తెలిపారు.

**బీఏసీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్**
రాష్ట్రంలో ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని, అసెంబ్లీని కనీసం 20 నుంచి 30 రోజుల పాటు నడపాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు శాసనమండలి సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించినట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. సభ్యుల కోరిక మేరకు అవసరమైతే మరిన్ని రోజులు పొడగిస్తామన్నారు. సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన తన ఛాంబర్‌లో మండలి బీఏసీ సమావేశం జరిగింది. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, ఎఫ్ఎండీ, శ్రీపాల్ రెడ్డి, శాసన మండలి సెక్రటరీ డా.నరసింహాచార్యులు పాల్గొన్నారు.

# రైతుల కోసం జీవితాన్ని ధారపోశారు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :**
సమస్యలపై అవగాహన, సంస్కారవంతంగా అంశాలను లేవనెత్తడంలో రైతు నాయకుడు సారంపల్లి మల్లారెడ్డికి సాటి లేరని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. కౌలు రైతుల సమస్య, పంటలకT గిట్టుబాటు ధర కోసం ఆయన ఎంతో పోరాడారన్నారు. భూమి సారం నుంచి పంట తీసేవరకు సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్న ఎన్‌సైక్లోపీడియా సారంపల్లి.. ఆయన రాసిన పుస్తకాలు, లేవనెత్తిన అంశాలను దృష్టిలో పెట్టుకుని రైతాంగ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని చెప్పారు. రవీంద్రభారతిలో సోమవారం జరిగిన సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో ఆయన ప్రసంగించారు. తొలుత ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సారంపల్లి అంటే వ్యక్తిగతంగా తనకు ఎంతో అభిమానం అని, భూమి లేని నిరుపేదలకు కనీస కూలి ఉండాలని కమ్యూనిస్టులు కొట్లాడితే కనీస వేతన చట్టం తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. దున్నేవాడికి భూమి కోసం కమ్యూనిస్టులు పోరాడారంటూ అసైన్డ్ భూములను 24 లక్షల 56 వేల ఎకరాలు కాంగ్రెస్ ప్రభుత్వం పంచిందని, పది లక్షల ఎకరాలు ఆదివాసీల చేతుల్లో ఉన్నాయని తెలిపారు. ఇది కమ్యూస్టుల పోరాటానికి .. కాంగ్రెస్ పరిష్కారం చూపి ఉపాధి హామీ చట్టం ద్వారా పని కల్పించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ తీసుకొచ్చిందని, కమ్యూనిస్టులు లేవనెత్తిన ప్రతీ సమస్యను కాంగ్రెస్ పరిష్కరించిందని ఆయన చెప్పారు. ఎన్నికల్లో కలిసినా కలవకపోయినా కమ్యూనిస్టుల పోరాటం కాంగ్రెస్ పార్టీకి ఉపయోగపడిందన్నారు. అందరం కలసి దేశంలో మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో గెలవలేనప్పుడు కొత్తకొత్త విధానాలను అవలంబిస్తున్నారని, 'సర' పేరుతో బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను టార్గెట్ చేసుకున్నారని, తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారని, బెంగాల్‌లో చేసినట్లే తెలంగాణలో చేస్తామని బీజేపీ నాయకులు బరితెగించి మాట్లాడుతున్నారని అన్నారు. గత ఎన్నికల్లో బూత్‌ల వారీగా ప్రైవేటు ఏజెన్సీలను పెట్టి సర్వేలు చేయించి క్రమపద్ధతిలో బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారని, ఎన్నికల కమిషన్‌ను కూడా బీజేపీ రాజకీయాలకు వాడుకుంటోందని ఆరోపించారు. 'సర'పై ప్రధాన ప్రతిపక్షం ఒక్క మాట మాట్లాడటం లేదని, దీని వెనక వారికున్న అవగాహనను కమ్యూనిస్టులు అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికలు వేరు.. పేదల ప్రాథమిక హక్కులు వేరు అన్నారు. ఎర్ర జెండా కనిపిస్తే పేదవాడికి ఒక భరోసా అని పేర్కొన్నారు. దేశానికి అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి నరేంద్రమోదీ మోదీ ఓటమే కమ్యూనిస్టుల గెలుపు అని అన్నారు. పేదల ఓటు హక్కును కమ్యూనిస్టులు కాపాడాలి అని పిలుపునిచ్చారు.

# 'సమ్మిట్' ఆహ్వానాలు పంపాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 7:**
రానున్న ఇన్వెస్ట్ తెలంగాణ – రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో ఉన్నతాధికారులతో సోమవారం సమావేశం నిర్వహించి సన్నాహకాలను సమీక్షించారు. గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు, సీఈఓలు, సీఎక్స్‌ఓలు, దౌత్యవేత్తలు తదితరులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా ప్రముఖులకు ఈమెయిల్స్ ద్వారా అధికారిక ఆహ్వానాలు పంపే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఆహ్వానితుల జాబితాను సిద్ధం చేసి, ఆహ్వానాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో నిర్వహించనున్న ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి విస్తృతంగా పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేందుకు కృషి చేయాలని సీఎస్ పేర్కొన్నారు. తెలంగాణలోని ఫ్యూచర్ సిటీ, ఐటీ, ఏఐ, ఫార్మాస్యూటికల్స్, డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాలు, మౌలిక వసతులు, ఆవిష్కరణలు తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను సమ్మిట్ ద్వారా ప్రపంచ పెట్టుబడిదారులకు సమర్థవంతంగా ప్రదర్శించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.



# గ్యాస్ వినియోగదారులకు కేంద్రం తీపి కబురు

- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 :**

వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటి వరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.



# సింగపూర్‌లో భారతీయులపై ద్వేషపూరిత వ్యాఖ్యలు

- విచారణకు ఆదేశించిన సింగపూర్ ప్రభుత్వం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 :**

సింగపూర్‌లో స్థానిక భారతీయులను, భారత సంతతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో సాగుతున్న జాత్యహంకార, ద్వేషపూరిత వ్యాఖ్యలపై ఆ దేశ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల చైనా-నేపాల్ సరిహద్దుల్లో సంభవించిన ప్రకృతి వైపరీత్యంలో పలువురు సింగపూర్ పౌరులు గల్లంతైన ఘటనలతో పాటు, ఎయిర్ ఇండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడుల వ్యవహారాన్ని ముడిపెడుతూ కొంతమంది ఆన్‌లైన్‌లో భారతీయులపై తీవ్ర స్థాయిలో ద్వేషాన్ని చిమ్మడంపై సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, సీనియర్ మంత్రులు కే. షణ్ముగం, లీ సీన్ లూంగ్‌లు తీవ్రంగా స్పందించారు. ఈ జాత్యహంకార వ్యాఖ్యలను ''అత్యంత సిగ్గుచేటు, హేయం, ఎంతమాత్రం సహించరానివి''గా అభివర్ణించిన సీనియర్ మంత్రి కె.షణ్ముగం, వీటిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. సమాజంలో మత, జాతిపరమైన సామరస్యానికి భంగం కలిగించే ఈ పోస్టులను వెంటనే తొలగించాలని డిజిటల్ అభివృద్ధి, సమాచార మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను కోరింది. ఏ ఒక్క వర్గంపైనా ద్వేషాన్ని సాధారణ అంశంగా మారనివ్వబోమని, తప్పు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సింగపూర్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సహించం

- ప్రతిపక్ష డీఎంకేపై సీఎం విజయ్ తీవ్ర ఆగ్రహం.. డీఎంకే అవినీతిపై సీఎం దాడి
- అసెంబ్లీలో పాత నివేదికల రచ్చ.. మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై హెచ్చరిక

**చెన్నై, సెప్టెంబర్ 7 :**

తమిళనాడు శాసనసభ సాక్షిగా తమిళగ వెట్రి కజగం (టీవీకే) వ్యవస్థాపకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకేపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిస్తూ, డీఎంకే హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా సభ ముందుంచారు. రాజకీయ విమర్శలను ప్రజాస్వామ్యంలో స్వాగతిస్తామని, అయితే మహిళలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సభ ముఖంగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. డీఎంకే నాయకులు ప్రజల తీర్పును గౌరవించకపోవడం వల్లే నేడు ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని విజయ్ విమర్శించారు. 1977 నాటి సర్కారియా కమిషన్ నివేదికను సభలో ఉటంకించిన సీఎం విజయ్, వీరాణం పైప్‌లైన్ ప్రాజెక్టులో కమీషన్లు దండుకున్న చరిత్ర డీఎంకేదని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై ఈడీ నమోదు చేసిన ఆరోపణలను ఆయన ప్రస్తావించారు. కాంట్రాక్టులు, పార్టీ ఫండ్ల పేరుతో శాతాల వారీగా కమీషన్లు దండుకున్న దాఖలాలు రికార్డుల్లో ఉన్నాయని మండిపడ్డారు. తాను అధికారం కోసం రాజకీయాల్లోకి రాలేదని, ఎంజీఆర్, ఎన్టీఆర్ వంటి మహానాయకుల వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

# భగ్గుమన్న చమురు ధరలు

- హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తత
- భారీగా తగ్గిన నౌకల రాకపోకలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 :**

పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య నౌకలపై పరస్పర దాడులు జరగడంతో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలతో సరఫరాకు దీర్ఘకాలిక అంతరాయం కలుగుతుందన్న భయాలు మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ఇరాన్ ఆయిల్ ట్యాంకర్లపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. దీనికి ప్రతిగా, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ కూడా అమెరికా నౌకలతో పాటు, అనధికారిక మార్గాల్లో ప్రయాణిస్తున్న ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఈ పరిణామాలను విశ్లేషకులు 'ప్రధాన ఘర్షణ'గా అభివర్ణిస్తున్నారు. ఈ ఘర్షణల ప్రభావం హర్మూజ్ జలసంధిపై తీవ్రంగా పడింది. సాధారణంగా ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. ప్రస్తుతం ఇక్కడ నౌకల రాకపోకలు భారీగా పడిపోయాయి. గతంలో రోజుకు 100కు పైగా నౌకలు ప్రయాణించగా, ఇప్పుడు ఆ సంఖ్య కేవలం 10కి పరిమితమైంది. త్వరలో ఈ ప్రాంతంలో కొత్తగా 'రిస్ట్రిక్టెడ్ జోన్' ప్రకటించేందుకు ఇరాన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 0.54 శాతం పెరిగి 96.80 డాలర్లకు చేరుకుంది. అమెరికా బెంచ్‌మార్క్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 0.72 శాతం పెరిగి 92.14 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. గత వారంలోనే ఈ ధరలు 810 శాతం వరకు పెరిగాయి.




మరోవైపు, సెప్టెంబర్ 6న సమావేశమైన ఒపెక్ ప్లస్ దేశాలు అక్టోబర్ ఉత్పత్తి విధానంలో ఎలాంటి మార్పులు చేయకూడదని నిర్ణయించాయి. హర్మూజ్ జలసంధిలో సరఫరా అంతరాయాలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2026 చివరి వరకు ఎగుమతులు పరిమితంగానే ఉంటాయని, పూర్తిస్థాయి పునరుద్ధరణ 2027లోనే సాధ్యమవుతుందని కొన్ని సంస్థలు అంచనా వేశాయి. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. తదుపరి దాడులు, దౌత్యపరమైన చర్చలపైనే మార్కెట్ గమనం ఆధారపడి ఉంటుంది.

# ప్రభుత్వ ఉద్యోగులకు సోషల్ మీడియా కట్టడి?

- కేంద్రం కొత్త నిబంధనలు!.. త్వరలో సోషల్ మీడియా కోడ్..
- ఉద్యోగులందరికీ ఒకే నిబంధన.. వ్యక్తిగత ప్రచారంపై ప్రత్యేక దృష్టి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియా వేదికలపై చేసే పోస్టులపై కట్టడి విధించేందుకు గాను ప్రత్యేకంగా 'సోషల్ మీడియా కోడ్ ఆఫ్ కండక్ట' తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి వేదికల్లో ఉద్యోగుల ప్రవర్తన, పోస్టులపై పరిమితులు విధించే దిశగా కొత్త నిబంధనలు రూపొందిస్తున్నట్లు ఉన్నతాధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల ప్రభుత్వ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ అంశాన్ని ప్రస్తావించి, దీనిపై సమగ్రంగా అధ్యయనం చేయాలని సీనియర్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ నూతన నిబంధనలు అమల్లోకి వస్తే హోదాతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒకే తరహా కోడ్ వర్తిస్తుంది. ఇటీవల కాలంలో కొందరు అధికారులు యూట్యూబ్ ఛానళ్లు నడపడం, ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేయడం, అధికారిక విషయాలపై వ్యక్తిగత అభిప్రాయాలు పంచుకోవడం ఎక్కువవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆయా శాఖల సర్వీస్ రూల్స్ మాత్రమే అమల్లో ఉండటంతో డిజిటల్ మీడియా విస్తృతికి అనుగుణంగా ఏం




పోస్ట్ చేయవచ్చు, ఏం చేయకూడదు, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి క్రమశిక్షణా చర్యలు ఉంటాయనే అంశాలపై కొత్త కోడ్ ద్వారా స్పష్టత రానుంది.

# సహారాన్‌పూర్‌లో మసీదు కూల్చివేత.. పురాతన బావి వెలుగులోకి

- తర్వాతి మధ్యయుగ కాలానికి చెందినదై ఉండొచ్చని అంచనా
- పూర్తి పరిశీలన తర్వాతే చారిత్రక నేపథ్యంపై స్పష్టత

**సహారాన్‌పూర్, సెప్టెంబర్ 7:**

ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారాన్‌పూర్ కలెక్టరేట్ ప్రాంగణంలో మసీదు కూల్చివేత వ్యవహారం రాజకీయ దుమారం రేపుతున్న వేళ.. అదే ప్రాంతంలో పురాతన బావి బయటపడటం ఆసక్తికరంగా మారింది. మసీదు శిథిలాలను తొలగించే సమయంలో వెలుగులోకి వచ్చిన ఈ బావిని పరిశీలించేందుకు ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) అధికారులు సోమవారం అక్కడికి చేరుకున్నారు. బావి నిర్మాణ కాలం, నిర్మాణ పద్ధతి, చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తించేందుకు ప్రాథమిక పరిశీలన చేపట్టారు.

**లఖోరీ ఇటుకలతో నిర్మాణం**

ఏఎస్ఐ అధికారుల పరిశీలనలో బావిని లఖోరీ ఇటుకలతో నిర్మించినట్లు గుర్తించారు. ఇటుకల మధ్య సున్నం-సుర్ఖీ మిశ్రమాన్ని వినియోగించినట్లు తెలిపారు. బావి సుమారు 20 అడుగుల లోతు, మూడు అడుగుల వ్యాసంతో ఉన్నట్లు అంచనా వేశారు. పైభాగం నుంచి సుమారు మూడు అడుగుల లోతు వరకు పలుచటి సున్నం పొర కనిపించినట్లు అధికారులు వెల్లడించారు.

**మధ్యయుగ కాలానికి సంబంధం?**

ఇలాంటి నిర్మాణ పద్ధతితో ఉన్న బావులు ఎగువ, మధ్య గంగా లోయ ప్రాంతాల్లో కనిపిస్తాయని ఏఎస్ఐ అధికారులు తెలిపారు. ఈ తరహా నిర్మాణాలు సాధారణంగా తర్వాతి మధ్యయుగ కాలంతో సంబంధం కలిగి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే బావి నిర్మించిన ఖచ్చితమైన కాలం, దాని చారిత్రక నేపథ్యంపై ఇప్పుడే నిర్ధారణకు రాలేమని స్పష్టం చేశారు. మరింతగా పరిశీలించిన తర్వాతే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**మసీదు కూల్చివేతతో వివాదం**

సహారాన్‌పూర్ కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రభుత్వ భూమిలో మసీదును అక్రమంగా నిర్మించారన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు కూల్చివేత చేపట్టారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఈ చర్యకు దిగింది. మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించిన అనంతరం బుల్డోజర్లతో నిర్మాణాన్ని తొలగించారు. శిథిలాలను తొలగిస్తుండగా నేల కింద స్లాబ్ కనిపించడంతో దాన్ని కట్టర్‌తో తొలగించగా బావి బయటపడింది.

# ఆరు స్థానాలకు ఉప ఎన్నికలు

- అక్టోబర్ 6న పోలింగ్.. 9న ఓట్ల లెక్కింపు
- నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు
- ఐదు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక
- ప్రజాప్రతినిధుల రాజీనామాలతో ఖాళీ అయిన స్థానాలు
- సెప్టెంబర్ 9న నోటిఫికేషన్ విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:**

దేశవ్యాప్తంగా ఆరు స్థానాలకు ఉప ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని ఐదు అసెంబ్లీ స్థానాలతో పాటు అస్సాంలోని నాగావ్ లోక్‌సభ స్థానానికి అక్టోబర్ 6న పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 9న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ప్రజాప్రతినిధుల రాజీనామాలతో ఖాళీ అయిన స్థానాల్లో ఈ ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

**ఆరు స్థానాలు**

తమిళనాడులో మదురాంతకం, ధారపురం అసెంబ్లీ స్థానాలు, పుదుచ్చేరిలో తట్టంచవాడి, పశ్చిమ బెంగాల్‌లో రేజినగర్, నందిగ్రామ్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. అస్సాంలోని నాగావ్ లోక్‌సభ స్థానానికి కూడా ఇదే షెడ్యూల్ ప్రకారం ఎన్నిక నిర్వహించనున్నారు.

**ఎన్నికల షెడ్యూల్**

సెప్టెంబర్ 9న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు సెప్టెంబర్ 16 చివరి తేదీ. సెప్టెంబర్ 17న నామినేషన్ పత్రాలను పరిశీలిస్తారు. సెప్టెంబర్ 19 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అక్టోబర్ 6న పోలింగ్, అక్టోబర్ 9న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అక్టోబర్ 11తో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది.

**రాజీనామాలతో ఖాళీ**

ప్రజాప్రతినిధుల రాజీనామాల కారణంగా ఈ ఆరు స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. నాగావ్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీ ప్రద్యుత్ బోర్దోలోయ్ రాజీనామా చేయడంతో అక్కడ ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. తమిళనాడులో మదురాంతకం ఎమ్మెల్యే మరగాతం కుమారవేల్, ధారపురం ఎమ్మెల్యే పి. సత్యభామ రాజీనామా చేశారు. పశ్చిమ బెంగాల్‌లో రేజినగర్ ఎమ్మెల్యే హుమాయున్ కబీర్, నందిగ్రామ్ ఎమ్మెల్యే సువేందు అధికారి రాజీనామా చేయడంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి.

# 'ఫేక్ వీడియో అని నాకు తెలియదు'

- వివాదంపై అభిజిత్ దీప్కే వివరణ
- రామజన్మభూమి ట్రస్ట్ సీఈవో పేరుతో వీడియో షేర్
- తప్పుదోవ పట్టించే పోస్టంటూ నెటిజన్ల విమర్శలు
- వ్యక్తిగత జీవితంపై అభ్యంతరం లేదన్న దీప్కే
- సామాజిక మాధ్యమాల్లో కొనసాగుతున్న చర్చ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 :**

రామజన్మభూమి ట్రస్ట్ సీఈవోను లక్ష్యంగా చేసుకుంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తాను షేర్ చేసిన వీడియో నకిలీదని ముందుగా తెలియదని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వివరణ ఇచ్చారు. వీడియోలో ఉన్న వ్యక్తిని రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ సీఈవో జితేంద్ర మిశ్రాగా పేర్కొంటూ చేసిన పోస్టుపై విమర్శలు రావడంతో ఆయన స్పందించారు. "నేను షేర్ చేసిన వీడియో ఫేక్ అని నాకు తెలియదు. ఏదేమైనా ఎవరి వ్యక్తిగత జీవితం వారిది. దానిపై నాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అని దీప్కే పేర్కొన్నారు. బాబీ డియోల్ నటించిన 'జమాల్ కుడు' పాటకు ఓ వ్యక్తి నృత్యం చేస్తున్న వీడియోను దీప్కే ఆదివారం తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. అందులో కనిపిస్తున్న వ్యక్తి రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ సీఈవో జితేంద్ర మిశ్రా అని పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితంలో ఎవరికి నచ్చినట్లు వారు ఉండడంలో తప్పులేదంటూనే.. ధర్మాన్ని కాపాడుతున్నామని చెప్పుకునే బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు తమ ప్రవర్తన గురించి ఆలోచించుకోవాలంటూ వ్యాఖ్యానించారు. అయితే వీడియోలో ఉన్న వ్యక్తి మిశ్రా కాదని తేలడంతో దీప్కే పోస్టుపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. ఒక





రాజకీయ సంస్థ వ్యవస్థాపకుడిగా ఉన్న వ్యక్తి వీడియో వాస్తవికతను నిర్ధారించుకోకుండా ప్రముఖ వ్యక్తికి ఆపాదిస్తూ ఎలా ప్రచారం చేస్తారని పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే వీడియోలు, చిత్రాల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందంటూ వ్యాఖ్యానించారు. కాగా, జితేంద్ర మిశ్రా ఇటీవల రామజన్మభూమి ట్రస్ట్ సీఈవోగా నియమితులైనట్లు కథనంలో పేర్కొన్నారు. ఆయన భారత వైమానిక దళంలో ఉన్నత స్థాయిలో సేవలందించి పదవీ విరమణ చేసిన ఎయిర్ మార్షల్ అని తెలిపింది. వీడియో నకిలీదని అంగీకరిస్తూ దీప్కే ఇచ్చిన వివరణతో వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.



## ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకోవాలి

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు జరిగిన అవమానం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు అవమానమేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ అన్నారు. కేటీఆర్, ఎమ్మెల్సీ తాతా మధు, కేసీఆర్ ల తీరును నిరసిస్తూ సోమవారం ఆయన ఆధ్వర్యంలో వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. తాతా మధు స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్, మాజీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్, జెట్టి రమేష్, బైరా సంతోష్, గుర్రాల బాల్ నరసింహారెడ్డి, గాజ శ్రీనివాస్, గండికోట సురేష్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, ఉపసర్పంచ్ మచ్చ కుమార్, వార్డు సభ్యులు బోనగం రమేష్, ఎలిగే సతీష్, యువజన అధ్యక్షుడు కర్రావుల సందీప్, జెల్ల ప్రభాకర్‌యాదవ్, దొమ్మటి శ్రీహరి, కుసుంబ శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ కుంట హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మతో సొంతింటి కల సాకారం



**శెనార్తి మీడియా, బెజ్జంకి:** ఇందిరమ్మ పథకంతో పేదల సొంతింటి కల సాకారమవుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బెజ్జంకి మండలం దాచారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మంజూరైన వడ్లకొండ స్వప్న–రమేష్ ఇంటికి ప్రధాన ద్వారాన్ని సొసైటీ చైర్మన్ ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, సర్పంచ్ బైర మానస రాజేందర్ కలిసి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీటి బాల నర్సు, గ్రామ శాఖ అధ్యక్షుడు మాతంగి భాస్కర్, వార్డు సభ్యులు అశోక్ బోడిగే, రామచంద్రం, వెంకయ్య, కనుకయ్య, రామస్వామి, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు షూ పంపిణీ



**శెనార్తి మీడియా, గన్నేరువరం:** గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు షూలు, యూనిఫాంలు, విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో షూలను ముందుగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నూనె అంజలి, ప్రధాన ఉపాధ్యాయుడు సత్యనారాయణ, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సేవలు కీలకం



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని జిల్లా సైన్స్ అధికారి జి. రాజగోపాల్ అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ పెంపొందించి వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా సైన్స్ కార్యాలయంలో మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాధికారి వి.ఎస్.వి. మాళవీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జి. రాజగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ప్రతిభ, సేవల ఆధారంగా ఎంపిక చేసిన పది మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులకు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి




**శెనార్తి మీడియా, బెజ్జంకి:** కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేశారు. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా హామీలు అమలు కాలేదని విమర్శించారు. మండలంలోని అసంపూర్తి రోడ్లను పూర్తి చేయడంతో పాటు మహాలక్ష్మి, రైతు భరోసా, పెన్షన్ల పెంపు, మహిళలకు నెలకు రూ.2,500, తులం బంగారం, ఉచిత స్కూటీలు, విద్యార్థుల పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, మాజీ ఎంపీటీసీ దుంబాల రాజా మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ దుమాల మహేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎలా శేఖర్‌బాబు, బండి రమేష్, తిప్పరపు మహేష్, కల్లూరి రమేష్, వంగల నరేశ్, తాడిచెట్టు భూమయ్య, రామంచ పరశురాములు, కల్లూరి అజయ్‌యాదవ్, కనగండ్ల సతీష్, ఏసీక కిషన్, కనగండ్ల శంకర్, మాసం బాబు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ భూమి ఆక్రమణపై కాంగ్రెస్ ఫిర్యాదు

**శెనార్తి మీడియా, బెజ్జంకి:** రేగులపల్లి శివారులో ప్రభుత్వ భూమిని ఆక్రమించి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోళ్లఫారం నిర్మించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించి ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని కోరారు. మండల స్థాయిలో ప్రజలకు అందుబాటులో ప్రజావాణి నిర్వహించడం వల్ల సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయని లింగాల శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్, యువజన మండల అధ్యక్షుడు కర్రావుల సందీప్, బెజ్జంకి టౌన్ అధ్యక్షుడు కత్తి రమేష్, రావుల నర్సయ్య, జెల్ల ప్రభాకర్, వార్డు సభ్యులు బోనగం రమేష్, పర్ష సంతోష్,



గాజ శ్రీనివాస్, డైరెక్టర్లు పుల్ల పోచయ్య, మాశం శంకర్, ఆయిలేని మహేందర్‌రెడ్డి, దుశెట్టి ప్రశాంత్, బోయిని ప్రశాంత్, సంగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేశవపట్నం రోడ్డు విస్తరించాలని వినతి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కేశవపట్నం అంబేద్కర్ చౌరస్తా నుంచి జెడ్పీ హైస్కూల్ వరకు రోడ్డును విస్తరించి ప్రమాదాలను నివారించాలని కరీంపేట గ్రామానికి చెందిన నాయకులు కోరారు. ఈ మేరకుఎంపీడీవో అనితకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ మార్గం ఇరుకుగా ఉండటంతో నిత్యం రద్దీగా మారుతోందని తెలిపారు. వీణవంక, జమ్మికుంట, శంకరపట్నం మండలాల నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వాహనాలతో ట్రాఫిక్ పెరుగుతోందని పేర్కొన్నారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అంబేద్కర్ చౌరస్తా నుంచి జెడ్పీ



హైస్కూల్ వరకు రోడ్డును అత్యవసరంగా విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో కరీంపేట మాజీ ఎంపీటీసీ గాండ్ల తిరుపతి, కేశవపట్నం మాజీ సర్పంచ్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాసమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



# ట్రైబల్ స్టడీస్ కోర్సు పూర్తి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** గిరిజనుల సంస్కృతి, సంప్రదాయా లు, జీవన విధానం, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన 'ట్రైబల్ స్టడీస్' సర్టిఫికెట్ కోర్సు విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కోర్సులో భాగంగా విద్యార్థులు గిరిజన ప్రాంతాలను సందర్శించి క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. ఫీల్డ్ ట్రిప్, గ్రౌండ్ వర్క్ ద్వారా గిరిజనుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారని అధ్యాప కులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిసాన్ ఓజా, కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ గోపాలకృష్ణ, హిస్టరీ విభాగం హెచ్‌ఓడీ రాజయ్య, పొలిటికల్ సైన్స్ విభాగం హెచ్‌ఓడీ కనకలక్ష్మి పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విక్రమ్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

బీఎంఎస్ ఆటో యూనియన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంచిర్యాల జిల్లా బీఎంఎస్ అధ్యక్షుడు చెల్ల విక్రమ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని బీఎంఎస్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్, రాష్ట్ర బీజేపీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి, మంచిర్యాల బీజేపీ కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ గాజుల ముకేశ్ గౌడ్, బీఎంఎస్ ఆటో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంతారం పెంటయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. మంచిర్యాల జిల్లాలో ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి విక్రమ్ చేస్తున్న కృషిని గుర్తించిన రాష్ట్ర కమిటీ ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. కొత్త బాధ్యతలతో ఆటో డ్రైవర్లు, కార్మికుల సమస్యల పరిష్కారానికి మరింత బాధ్యతగా పనిచేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.



# వాగులో పేరుకుపోతున్న చెత్త..



- కలుషితమవుతున్న నీరు
- నిర్లక్ష్యం వీడని అధికారులు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కేశవపట్నం జాతీయ రహదారి వాగు బ్రిడ్జి చెత్తకుప్పగా మారింది. వ్యాపారులు చికెన్ వ్యర్థాలు, కూరగాయల వ్యర్థాలు, హోటళ్లు, దుకాణాల చెత్తను వాగులో వేస్తుండటంతో నీరు కలుషితమై దుర్వాసన వెదజల్లుతోంది. ఈ నీటిని తాగుతున్న పశువులు అనారోగ్యం పాలవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీటితో పంటలు సాగు చేయాల్సి వస్తోందని, దుర్వాసన కారణంగా వ్యవసాయ పనులకు కూలీలు రావడం లేదని వాపోతున్నారు. సమీపంలో డంపింగ్ యార్డు ఉన్నా వ్యాపారులు వాగులోనే చెత్త వేస్తున్నారని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వాగు నీరు ముత్తారం చెరువు, అక్కడి నుంచి గద్దపాక, కల్వల ప్రాజెక్టులకు చేరుతుందని, తాగునీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి చెత్త పారవేతను అరికట్టాలని డిమాండ్ చేశారు.

**ప్రజావాణి ఫిర్యాదుకూ స్పందన కరువు**

కేశవపట్నం వ్యాపారులు మక్త గ్రామానికి వెళ్లే దారిలో చికెన్ వ్యర్థాలు వేయడంతో వీధికుక్కలు గుంపులుగా చేరి ప్రయాణికులు, వాహనదారులపై దాడులు చేస్తున్నాయని మక్త గ్రామ సర్పంచ్ గత సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటివరకు చర్యలు లేకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### గార్లకుంట చెరువు మత్తడికి లీకేజీ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



ఇటీవల కురిసిన వర్షాలకు శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలోని గార్లకుంట చెరువులో చేరిన నీరు.. మత్తడి లీకేజీతో వృథాగా పోతోందని ఉపసర్పంచ్ చింతం రాజేష్ తెలిపారు. భవిష్యత్‌లో నీటి వనరుల కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున మత్తడి లీకేజీని వెంటనే అరికట్టి నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఎంపీడీవో అనితకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

# 420 హామీలు అమలు చేయాలి



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కాంగ్రెస్ ఎన్నికల హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో అనితకు వినతిపత్రం అందించారు. మహిళలకు రూ.2,500 సాయం, తులం బంగారం, రైతులకు ప్రతి పంటకు రూ.15 వేల రైతు భరోసా, పంటలకు బోనస్, రైతు కూలీలకు రూ.12 వేల సాయం, నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు, విద్యా భరోసా, రూ.4 వేల పింఛన్లు తదితర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం**

కేశవపట్నం అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గంట మహిపాల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందని ఆరోపించారు. హామీలు అమలు చేయకపోతే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేటీఆర్, తాతా మధు దిష్టిబొమ్మల దహనం



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** అసెంబ్లీ స్పీకర్‌పై దుర్భాషలాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి తిరుపతి ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద కెటీఆర్, తాతా మధు దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీఆర్ఎస్ నాయకులు అహంకార వైఖరి వీడి తీరు మార్చుకోవాలని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. కార్యక్రమంలో గోపగోని బసవయ్య, కీసర సంపత్, నాంపల్లి తిరుపతి, కోరేం రాజిరెడ్డి, చింతం రాజేశం, కల్లెపెల్లి రాజయ్య, మారవేణి రాజయ్య, అర్థం కుమార్, తాటికొండ సదానందం, షారూఖ్, అజయ్ పాల్గొన్నారు.

### శిలాఫలకంపై మహిళా సర్పంచ్ భర్త పేరు చేర్పుపై అభ్యంతరం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** కాచాపూర్ లో ఆరోగ్య ఉపకేంద్రం శిలాఫలకంపై మహిళా సర్పంచ్ భర్త పేరు చేర్చడంపై కేశవపట్నం ఉపసర్పంచ్, ఉపసర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆకుబత్తిని విజయ్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్ ల పేర్లు శిలాఫల కాలపై ఉండవని ప్రోటోకాల్ చెబుతున్న అధికారులు, మహిళా సర్పంచ్ భర్త పేరు ఏ నిబంధన ప్రకారం చేర్చారో స్పష్టం చేయాలని కోరారు. ఈ మేరకు పంచాయతీరాజ్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. అన్ని గ్రామాల్లో నిబంధనలను ఏకరీతిగా అమలు చేయాలని కోరారు




# క్యారెక్టర్ ఆర్టిస్ట్ జయప్రకాశ్ రెడ్డి

## నేడు జయప్రకాశ్ రెడ్డి వర్ధంతి

**జయప్రకాశ్ రెడ్డి తెలుగు నటుడు. రాయలసీమ యాసలో ఆయన చెప్పే సంభాషణలు ప్రసిద్ధి. ఈయన ఎక్కువగా ప్రతినాయక, హాస్య పాత్రలను పోషిస్తుండే వాడు.**

1946 మే 8 న కర్నూలు జిల్లా, ఆళ్ళగడ్డ మండలంలోని శిరువెళ్ళ గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. తండ్రి సాంబిరెడ్డి సబ్ ఇన్‌స్పెక్టర్ గా పనిచేసే వాడు. నెల్లూరు లోని పత్తేకాన్ పేటలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు చదివాడు. తర్వాత నెల్లూరులోని రంగనాయకుల పేట లోని ఉన్నత పాఠశాలలో చేరాడు. పదో తరగతిలో ఉండగా తండ్రికి అనంతపురం బదిలీ అయ్యింది. అక్కడ సాయిబాబా నేషనల్ హయ్యర్ సెకండరీ స్కూల్లో ఎస్ఎస్ఎల్‌సీలో చేరాడు. చిన్నప్పటి నుంచే నాటకాలంటే ఆసక్తి ఉండేది. తండ్రి కూడా నటుడే అయినందున, ఇంట్లో కుటుంబ సభ్యులు కూడా అందుకు అడ్డు చెప్పేవారు కాదు. తండ్రీ కొడుకులు కలిసి కూడా నాటకాల్లో నటించారు. చదువులోనూ ముందుండే వాడు. డిగ్రీ తర్వాత ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని గణితం ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాడు. అనంతపురం లోని పాఠశాలలో చదివేటపుడు అక్కడి టీచర్లందరూ ఆచార్యులే. గుండాచారి అని సైన్స్ టీచర్ కల్చరల్ యాక్టివిటీస్‌కి హెడ్‌గా పని చేసేవారు. కళలపై ఆయనకున్న అభిమానం ఇతనిపై చాలా పని చేసింది. ఒకరోజు ఆయన, స్నేహితుడు 'దుర్యోధన గర్వ భంగం' అనే నాటికలో పద్యాలు, డైలాగులు బట్టీ కొట్టేసి ఆయన దగ్గరకెళ్లి టపటపా అప్ప చెప్పాడు. ఎక్కడ తేడా వచ్చిందో తెలీదు. ఆయన చాలా కోపంగా 'మళ్లీ నాటకాల పేరెత్తితే తన్నేస్తాను వెధవల్లారా అంటూ అరిచాడు. ఆయన స్నేహితుడు లైట్‌గా తీసుకున్నాడు గానీ.. జయప్రకాష్ మాత్రం చాలా ఫీలయ్యాడు. మూడురోజులు బెంగ పెట్టు కున్నాడు. ఆ బాధ, కసి కారణంగానే నటనను వృత్తిగా స్వీకరించాలని ధృఢ నిర్ణయం తీసుకున్నాడు. ఒకసారి జయ ప్రకాష్ రెడ్డి నల్గొండలో గప్ చుప్ అనే నాటకాన్ని ప్రదర్శిస్తుండగా దాసరి నారాయణరావుకు ఆయన నటన నచ్చి, నిర్మాత రామా నాయుడుకు పరిచయం చేశాడు. అలా ఈయన 1988లో విడుదలైన "బ్రహ్మపుత్రుడు" చిత్రంతో తెలుగు సినీరంగానికి పరిచయ మయ్యాడు. అయితే 1997 లో విడుదలైన "ప్రేమించుకుందాం రా" చిత్రం ప్రతి నాయకునిగా మంచి పేరు తీసుకుని వచ్చింది. తరువాత బాలకృష్ణ కథా నాయకుడిగా వచ్చిన సమరసింహా రెడ్డి, నరసింహ నాయుడు లాంటి విజయవంతమైన సినిమాల్లో కూడా ఇలాంటి పాత్రతోనే ప్రేక్షకులను మెప్పించాడు.

**వరల్డ్ ఫేమస్ లవర్ (2020); సిల్లీ ఫెలోస్ (2018); అమర్ అక్బర్ ఆంటోని (2018)"; విజేత (2018); ఎమ్ఎల్ఏ (2018); నేనే రాజు నేనే మంత్రి (2017); రాధ (2017); హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామయ్య (2017); సుప్రీమ్ (2016); ఇంట్లో దెయ్యం నాకేం భయం (2016); మీలో ఎవరు కోటీశ్వరుడు (2016); పండగ చేస్కో (2015); జేమ్స్ బాండ్ (2015); సౌఖ్యం (2015); ప్రతినిధి (2014); గలాట (2014); జంప్ జిలాని (2014); ఎదురులేని అలెగ్జాండర్ (2014); షాడో (2013); అడ్డా (2013); నిప్పు (2012); దేవరాయ (2012); ప్రస్థానం (2010); బ్రహ్మలోకం టు యమలోకం వయా భూలోకం (2010); ఆలస్యం అమృతం (2010); కిక్ (2009); కింగ్ (2008); రెడీ (2008); ఆట (2007); విక్రమార్కుడు (2006); ఛత్రపతి (2005); ఎవడిగోల వాడిదే (2005); ఎంజాయ్ (2004); కబడ్డీ కబడ్డీ; ఆయుధం (2003); చెన్న కేశవరెడ్డి (2002); లాహిరి లాహిరి లాహిరిలో (2002); నరసింహ నాయుడు; అల్లరి రాముడు (2002); ఆనందం; అడవి చుక్క (2000); ప్రేమించు కుందాం రా (1997); నీకోసం (1999); చిత్రం భళారే విచిత్రం (1992); బ్రహ్మ పుత్రుడు (1988) (తొలి చిత్రం) లలో విభిన్న పాత్రలు ఆయనకు పేరు తెచ్చి పెట్టాయి. గత ఏడాది సెప్టెంబర్ 8న జయప్రకాష్ రెడ్డి ఆకస్మిక మరణంతో తెలుగు సినిమా లోకం ఒక విలక్షణ నటుడిని కోల్పోయింది. ధర్మపురి క్షేత్రస్త శ్రీ లక్ష్మి నరసింహ నాట్య మండలి ఆద్వర్యంలో హైదరాబాద్లోని రవీంద్ర భారతిలో 2016 మార్చి 5న ప్రదర్శించిన వీర పాండ్య కట్ట బొమ్మన చారిత్రక నాటకాన్ని ఆసాంతం చూసిన జయప్రకాష్ రెడ్డి, నాటకం అయినాక స్టేజీ పైకి వెళ్ళి, తనూ ఈ నాటకంలో చాలా సార్లు ఎట్టప్ప విలన్ పాత్రలో నటించానని, ప్రేక్షకులకు వివరించి కట్ట బొమ్మన నాటకంలోని కళాకారులను ఒక్కొక్కరిని అభినందించిన నేపథ్యాన్ని కళాకారులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.**




రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆరోగ్య సంరక్షణలో ఫిజియోథెరపీ విప్లవం

**శరీర కదలికతో శాశ్వత ఆరోగ్యం.. ఫిజియోథెరపీ సందేశం**

**నేడు ప్రపంచ శారీరక చికిత్స దినోత్సవం**








ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8న ప్రపంచ శారీరక చికిత్స దినోత్సవాన్ని జరుపు కుంటారు. ఈ దినోత్సవాన్ని 1996లో ప్రపంచ ఫిజియోథెరపీ సమాఖ్య అధికారికంగా ప్రకటించింది. నిజానికి ఈ సమాఖ్య 1951లోనే సెప్టెంబర్ 8వ తేదీన స్థాపించ బడింది. అందువల్ల ఈ తేదీకి విశేషమైన ప్రాధాన్యం కలిగింది. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ యొక్క శాస్త్రీయ ప్రాముఖ్యతను, ప్రజల ఆరోగ్య రంగంలో దీని పాత్రను ప్రపంచానికి తెలియ జేయడం ప్రధాన ఉద్దేశం. ఫిజియోథెరపీ ఆధునిక వైద్య విధానంలో ఒక ముఖ్యమైన విభాగం. ఇది శరీర కదలికల ఆధారంగా వ్యాయామం, మాన్యువల్ థెరపీ, నాడీ ఉద్దీపన పద్ధతులు, పరికరాల వినియోగం వంటి శాస్త్రీయ మార్గాల ద్వారా వ్యాధులు, గాయాలు, దీర్ఘకాలిక నొప్పుల నుండి ఉపశమనం కలిగించే వైద్యశాస్త్రం. గాయం తర్వాత పునరుద్ధరణ మాత్రమే కాకుండా దీర్ఘకాలిక వ్యాధుల నివారణ, శస్త్రచికిత్సల అనంతర పునరావాసం, క్రీడాకారుల శారీరక పనితీరు మెరుగు పరచడం, వృద్ధాప్యంలో శక్తి నిలుపుదల, పక్షవాతం వచ్చినవారికి మళ్లీ నడక నేర్పించడం, ఊపిరి తిత్తులు మరియు గుండె సమస్యల పరిష్కారం వంటి విభిన్న కోణాలలో ఇది అపారమైన సేవ చేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సుమారు 1.7 బిలియన్ మంది కండరాలు, ఎముకలు, కీళ్ళ సమస్యలతో బాధ పడుతున్నారు. వీరిలో సగానికి పైగా ప్రజలు సరైన పునరావాస సేవలు పొందక పోవడం వల్ల శాశ్వత సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రతి సంవత్సరం మిలియన్లాది మంది రోడ్డు ప్రమాదాలు, స్ట్రోక్‌లు, మధుమేహం, వయోభారం వంటి కారణాలతో కదలిక సమస్యలకు గురవుతున్నారు. ఫిజియోథెరపీ వీరిలో చాలా మందికి మళ్లీ సాధారణ జీవన విధానం లోకి రావడానికి సహకరిస్తోంది. ఈ శాస్త్రం యొక్క అసలు బలమే కదలికను శాస్త్రీయంగా తిరిగి సాధించడం. అందుకే దీనికి "మూవ్మెంట్ ఈజ్ లైఫ్" అనే మంత్ర వాక్యం సరైన ప్రతిబింబంగా నిలుస్తుంది. భారత దేశంలో ఫిజియోథెరపీ రంగం గత రెండు దశాబ్దాల్లో విశేషంగా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం 500కుపైగా వైద్య కళాశాలలు, విశ్వ విద్యాలయాలు డిగ్రీ, పీజీ కోర్సులను అందిస్తున్నాయి. దేశంలో మూడున్నర లక్షలకు పైగా నమోదు చేసిన ఫిజియోథెరపిస్టులు సేవలందిస్తున్నారు. ప్రతి మెట్రో నగర ఆసుపత్రిలో ప్రత్యేక ఫిజియోథెరపీ విభాగం ఏర్పాటు చేయడం తప్పని సరిగా మారింది. క్రీడా రంగంలో ఐపీఎల్, హాకీ, ఒలింపిక్స్ వంటి క్రీడా జట్లకు ప్రత్యేక ఫిజియోథెరపీ బృందాలు పనిచేస్తున్నాయి. అలాగే వృద్ధాప్యంలో సంరక్షణ అవసరాలు పెరుగుతున్న తరుణంలో "హోమ్ ఫిజియోథెరపీ" సేవలు విస్తృతంగా వ్యాప్తి చెందుతున్నాయి. చిన్న పట్టణాలు, గ్రామాల్లో కూడా ఇప్పుడు ఈ సేవల అవసరాన్ని ప్రజలు గుర్తించ సాగారు. ప్రపంచ ఫిజియోథెరపీ సమాఖ్య ప్రతి సంవత్సరం ఒక ప్రధాన అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ అంశంపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. 2025 సంవత్సరానికి ప్రధాన అంశంగా "జప్త్రతీశీఅఱఅవ్రెుఖఱఅ ఢ్రాప్త్రఎంఱశ్ట్రవత్శుజూం" అనే విషయాన్ని ఎంచుకున్నారు. దీర్ఘకాలిక నొప్పులు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అత్యంత సాధారణ ఆరోగ్య సమస్యలలో ఒకటిగా మారాయి. ప్రతి ఐదుగురిలో ఒకరు నడుము, మోకాళ్లు, మెడ నొప్పులతో బాధపడుతున్నారని తాజా అంచనాలు చెబుతున్నాయి. మందులతో కేవలం తాత్కాలిక ఉపశమనం పొందగలిగిన ఈ సమస్యలను శరీర భంగిమల మార్పులు, క్రమబద్ధమైన వ్యాయామం, పునరావాస పద్ధతులు, థెరప్యూటిక్ టెక్నిక్స్ ద్వారా శాశ్వతంగా నియంత్రించ గలమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ రంగంలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యత మరింతగా పెరుగుతోంది. సెప్టెంబర్ 8న ప్రపంచ వ్యాప్తంగా విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ఫిజియోథెరపీ సంఘాలు ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య ర్యాలీలు, సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తాయి. పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతారు. స్ట్రోక్, మధుమేహం, వృద్ధాప్య సమస్యలు, క్రీడా గాయాల వంటి అంశాలపై ప్రజలకు సలహా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ప్రజలకు వ్యాయామం, సరైన శరీర భంగిమ, క్రమశిక్షణ, కదలికల ప్రాముఖ్యత గురించి వివరిస్తారు. ప్రపంచ శారీరక చికిత్స దినోత్సవం కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు. ఇది ఆరోగ్య సంరక్షణలో ఫిజియోథెరపీ వృత్తి స్థానం, భవిష్యత్తు దిశను ప్రతిబింబించే ఒక విశ్వ వేదిక. శారీరక కదలికే జీవన శక్తి, దాన్ని శాస్త్రీయంగా వినియోగించి జీవన నాణ్యతను మెరుగు పరచే మార్గం ఫిజియోథెరపీ అని ఈ రోజు మనకు స్పష్టంగా గుర్తు చేస్తుంది. ఆధునిక సాంకేతికతల ప్రభావంతో కదలికలు తగ్గుతున్న తరుణంలో మనం వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలి. చిన్ననాటి నుంచే శారీరక చైతన్యాన్ని పెంపొందించు కోవాలి. వ్యాధులు రాకముందే నివారణ చర్యలు చేపట్టడం, వ్యాధుల అనంతరం సమర్థవంతమైన పునరావాసం సాధించడం వంటి లక్ష్యాలకు ఫిజియోథెరపీ మార్గదర్శి. అందువల్ల సెప్టెంబర్ 8 మనకు అందించే అసలు సందేశం ఒక్కటే– –కదలికే జీవం, క్రమశిక్షణే ఆరోగ్యం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆర్థికాభివృద్ధి సాధనకు అక్షాస్యత అనివార్యం

**నేడు అక్షరాస్యతా దినోత్సవం**



సాంప్రదాయకంగా భాషను ఉపయో గించేందుకు అవసరమైన చదవటం, రాయటం, వినటం, మాట్లాడటం అనే నాలుగు ప్రాథమికాంశాలు తెలుసు కోవటాన్నే అక్షరాస్యత అనవచ్చు. అయితే.. రాయడం, చదవటం మాత్రమే అక్షరాస్యత కాదనీ.. గౌరవం, అవకాశాలు, అభివృద్ధి గురించి చెప్పడమే నిజమైన అక్షరాస్యత అని విజ్ఞుల అభిప్రాయం. ప్రపంచం అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు విద్య, విజ్ఞానం ఎంతో అవసరం. ఉన్నతమైన జీవనానికి ఇవి ఎంతో ముఖ్యం. యునెస్కో సెప్టెంబర్ 8 తేదీని అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవంగా ప్రకటించింది. దీని ముఖ్య ఉద్దేశం అక్షరాస్యతను వ్యక్తులు మరియు సంఘాలకు అందించడం. ఇది పిల్లల్లోనే కాకుండా వయోజన విద్య మీద కూడా కేంద్రీకరించ బడినది.

ప్రతి యేడాది సెప్టెంబర్ 8వ తేదీని "అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం"గా జరుపు కోవడం ఆనవాయితీ. 1965వ సంవత్సరం, నవంబర్ 17వ తేదీన యునెస్కో సభ్య దేశాల విద్యా శాఖా మంత్రుల మహాసభ అనంతరం.. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ప్రకటించ బడింది. ఆ తరువాత 1966వ సంవత్సరం నుండి ప్రతి యేడాదీ క్రమం తప్పకుండా జరుపు కుంటున్నాం. ప్రపంచంలోని కొన్ని దేశాలు అన్ని రకాలుగా వెనుబడి ఉండటానికి నిరక్షరాస్యత ముఖ్య కారణమనేది కాదనలేని వాస్తవం. అదలా ఉంటే... ఐక్య రాజ్య సమితి విద్యా, విజ్ఞాన (శాస్త్రీయ) మరియు సాంస్కృతిక సంస్థ (యునెస్కో), ఐక్యరాజ్య సమితికి చెందిన ఒక ప్రధాన అంగము. ఇది1945లో స్థాపించ బడిన ప్రత్యేక సంస్థ. ఈ సంస్థ తన క్రియా శీల కార్య క్రమాలలో శాంతి, రక్షణలకు తోడ్పాటును అందించటమే గాక... అంతర్జాతీయ సహకారంతో విద్య, విజ్ఞానం, సాంస్కృతిక పరిరక్షణ కోసం పాటు పడుతుంది. 193మంది సభ్యులు, ఆరుగురు అసోసియేట్ సభ్యులు కలిగిన యునెస్కో ప్రధాన కేంద్రం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఉంది. యునెస్కో తన తన కార్య క్రమాలను 5 రంగాలలో నిర్వహిస్తుంది, అవేంటంటే... విద్య, ప్రకృతి విజ్ఞానం, సామాజిక మరియు మానవ శాస్త్రాలు, సంస్కృతి, మరియు కమ్యూనికేషన్లు మరియు ఇన్ఫర్మేషన్. యునెస్కో, విద్య ద్వారా "అంతర్జాతీయ నాయకత్వం" కొరకు అవకాశాల కల్పనలో తన వంతు కృషి చేస్తుంది. దీని ప్రధాన ఉద్దేశ్యం... వివిధ దేశాలలో విద్యా విధానలను క్రమ బద్ధీకరించడం, ట్రైనింగ్ రీసెర్చ్‌లు చేపట్టడం. యునెస్కో ప్రజా ప్రకటనలిచ్చి, ప్రజలను చైతన్యవంతం చేస్తుంది. సాంస్కృతిక మరియు శాస్త్రీయ ఉద్దేశ్యాలు కలిగిన ప్రాజెక్టులను చేపడుతుంది. "భావ వ్యక్తీకరణ స్వాతంత్ర్యాన్ని, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ప్రోత్సహిస్తుంది. మీడియా ద్వారా, సాంస్కృతిక భిన్నత్వాలను తెలియ జేస్తున్నది. కాగా... యునెస్కో 1990 సంవత్సరాన్ని అక్షరాస్యతా సంవత్సరంగా ప్రకటించింది. ఇక ఐక్యరాజ్య సమితి అయితే 2003–2012ను అక్షరాస్యతా దశాబ్దంగా ప్రకటించింది. ఆ సంగతలా పక్కన బెడితే... ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం ఆశించిన స్థానంలో లేదు. ఈ మాత్రమైనా మనదేశ అక్షరాస్యత ఉందంటే కొన్ని రాష్ట్రాలు అక్షరాస్యతను సాధించటంలో ముందుండటమే. మొత్తం మీద ప్రపంచ నిరక్షరాస్యుల్లో 35% మంది ఇంకా మనదేశం లోనే ఉండటం విచారకరం. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధించాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన 73 ఏళ్లు గడుస్తున్నా 75 శాతం అక్షరాస్యతనే సాధించ గలిగాము. అందరూ చదివి నప్పుడే గ్రామాభివృద్ధి జరుగుతుంది. భారత దేశంలో అక్షరాస్యత రేటులో విస్తృత స్థాయిలో లింగ పరమైన అసమానత ఉంది. వయోజనుల అక్షరాస్యత రేటు పురుషుల్లో 76.9 శాతం ఉండగా, మహిళల్లో ఇది 54.5 శాతం మాత్రమే ఉంది. తక్కువ మహిళా అక్షరాస్యత రేటు భారత దేశంలో కుటుంబ నియంత్రణ, జనాభా స్థిరీకరణ చర్యలపై నాటకీయంగా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అక్షరాస్యత వృద్ధిలో చారిత్రక క్రమాల ఆధారంగా, ప్రస్తుతం అత్యధిక మంది నిరక్షరాస్యులు భారతదేశం లోనే ఉంటారని అంచనా. వయోజన అక్షరాస్యత 15 సంవత్సరాలు, అంత కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిని సూచిస్తుంది. యువజన అక్షరాస్యత 15–24 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారిని సూచిస్తుంది. ఒకవైపు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆడపిల్లలు చదువులో దూసు కెళుతున్నారు. మరోపక్క పేద దేశాల్లో బాలికలు పాఠశాల మెట్లెక్కడమే అదృష్టంగా భావిస్తున్నారు. 1947లో భారతదేశ అక్షరాస్యత కేవలం 12 శాతం మాత్రమే. 2018లో దేశ అక్షరాస్యత 74 శాతానికి చేరడం విశేషం. అంటే 517 శాతం పెరిగింది. భారతదేశంలో అక్షరాస్యత సామాజిక – ఆర్థిక పురోగతికి కీలకంగా ఉంది. తాజా అధ్యయనం ప్రకారం భారత అక్షరాస్యత రేటు, ఆరు రెట్ల కంటే ఎక్కువ వృద్ధి సాధించినప్పటికీ, ప్రపంచ అక్షరాస్యత సగటుతో పోలిస్తే ఇప్పటికీ తక్కువగానే ఉంది. ప్రపంచంలో భారతదేశం ప్రస్తుతం అతి పెద్ద నిరక్షరాస్య జనాభా ఉన్న దేశంగా గుర్తించ బడుతోంది. అనేక ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేసినప్పటికీ భారతదేశ అక్షరాస్యత శాతం మంద కొడిగానే వృద్ధి చెందింది. ఇలాగైతే సంపూర్ణ అక్షరాస్యత స్థాయి సాధించడానికి భారతదేశానికి 2060 వరకు సమయం పడుతుందని సూచించింది. ఆసక్తికర అంశం ఏమిటంటే... ప్రపంచ జ్ఞాన వ్యవస్థలో భారతదేశం చాలా కీలక పాత్ర పోషించ బోతోంది. భారత్ ప్రపంచ గురువు కాబోతోంది. ప్రపంచంలోనే అతి పెద్ద సంస్కరణ 'నిష్టా' పేరిట 42 లక్షల మంది టీచర్లకు కేంద్ర ప్రభుత్వ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. విలువలు, ప్రమాణాలతో కూడిన విద్యను అందించే దిశగా అనేక చర్యలను కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ తీసుకుంది, మరిన్ని చర్యలను తీసుకో బోతోంది. నూతన విద్యా విధానంపై భారతీయులు అందరి అభిప్రాయాలు తెలుసు కోవాలనేదే మోడీ సర్కారు ఉద్దేశం. రాష్ట్రాల విద్యా మంత్రుల తోనూ, విద్యా శాఖ కార్యదర్శుల తోనూ, ముఖ్య మంత్రుల తోనూ నూతన విద్యా విధానంపై అభిప్రాయాలను గత ప్రభుత్వం

సేకరించడం జరిగింది. ఎన్‌జీవోలు, విద్యా రంగంలో గణనీయమైన ప్రగతి సాధించిన వారిని నేరుగా సంప్రదించి వారి అభిప్రాయాలను తెలుసుకుని, ఇక సామన్య ప్రజలు సైతం తమ అభిప్రాయలను తెలిపే వీలు కల్పించారు. ఇందుకు ప్రత్యేకించి ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఎటువంటి విద్యా విధానాన్ని కోరు కుంటున్నారనేది తెలియ జేయాలని కోరారు. ప్రతి సంస్కరణ, దేశ పురోభివృద్ధికి బాటలు వేయాలనేదే ఉద్దేశం. ఉన్నత విద్య సంస్కరణలు, భాషల అభివృద్ధి, పరిశోధనలకు పెద్ద పీట వేయాలని నూతన విద్యా విధానంలో తలపెట్టారు. ఇందుకు పెద్ద ఎత్తున నిధులు అవసరమవుతాయి. నిధుల సమీకరణ అనివార్యమే, అపుడే మనం ఆశించే సమగ్ర విద్యా విధాన విధాన అమలు కు మార్గం సుగమం అవుతుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ

## దులీప్ ట్రోఫీ ఫైనల్లో అరుదైన చరిత్ర

దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరఫున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛటేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు. మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన స్థానాన్ని తిరిగి సాధించేందుకు ఇషాన్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఇన్నింగ్స్ మరింత బలాన్నిచ్చింది. ఈస్ట్ జోన్ చివరిసారిగా 13 ఏళ్ల క్రితం దులీప్ ట్రోఫీని గెలిచింది. ప్రస్తుత ఫైనల్లో ఆ జట్టు ఆధిపత్యంలో ఉంది. బౌలర్లు రాణిస్తే రెండోసారి బ్యాటింగ్ చేయకుండానే టైటిల్ గెలిచే అవకాశం ఉంది.

# రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు!

## పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం

పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఆ దేశ ఆటగాళ్లపై ఏకంగా ఫిక్సింగ్ ఆరోపణలు రావడం తీవ్ర దుమారం రేపుతోంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) అంతర్గత విచారణ కూడా చేపట్టినట్లు తెలుస్తోంది. మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ ఆఫ్ ఫీల్డ్ ప్రవర్తన అనుమానస్పదంగా ఉందనే వార్తలు కలకలం సృష్టించాయి. ఇంగ్లండ్ పర్యటనలో ఘోర పరాజయాలతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కోల్పోయిన పాకిస్థాన్ జట్టు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఈ ఘోర పరాజయాల నేపథ్యంలో పీసీబీ కూడా కఠిన చర్యలు తీసుకుంది. హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌తో పాటు ఏడుగురు ఆటగాళ్లపై వేటు వేసింది. దాంతో పాకిస్థాన్ జట్టు అప్రతిష్టపాలై ఇంట బయట తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. అయితే ఇంగ్లండ్ గడ్డపై పాకిస్థాన్ ఘోర పరాజయాలకు క్రికెటర్ల వైఫల్యంతో పాటు... ఫిక్సింగ్ కూడా ఓ కారణమని మీడియాలో కథనాలు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ముఖ్యంగా వేటుకు గురైన ఏడుగురిలో రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ మొబైల్ డేటాను పీసీబీ స్వాధీనం చేసుకొని విచారణ జరుపుతుందని పాక్‌కు చెందిన జియో న్యూస్ పేర్కొంది. ఈ కథనం ప్రకారం.. పీసీబీ అధికారులు.. కేవలం ఆటగాళ్ల ప్రవర్తననే కాకుండా.. వారు సంప్రదించిన వ్యక్తులను కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిక్సింగ్ ఆరోపణలకు సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రావాల్సి ఉన్నప్పటికీ.. రిజ్వాన్, ఇమామ్ భవిష్యత్తుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంగ్లండ్ పర్యటనకు రిజ్వాన్, ఇమామ్‌లను ఎంపిక చేయడంపై వివరణ కోరుతూ సెలెక్టర్లకు పీసీబీ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు మూడో టెస్ట్ ఆడే ఆటగాళ్ల నుంచి పీసీబీ మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పాకిస్థాన్ వార్తా సంస్థ 365 న్యూస్ పేర్కొంది. మ్యాచ్ ముగిసే వరకు ఆటగాళ్లకు మొబైల్స్ ఇచ్చేది లేదని స్పష్టం చేసినట్లు రాసుకొచ్చింది. బర్మింగ్‌హామ్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యం పాక్ బోర్డు విచారణకు ఆదేశించింది. ఆటగాళ్లపై క్రమశిక్షణపరంగా.. అంతర్గత విచారణ జరుపుతున్నామని సోమవారం పీసీబీ మీడియా ప్రతినిధి అమీర్ మీర్ వెల్లడించాడు. 'ఇంగ్లండ్ పర్యటనలో పాక్ ఆటగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తన గురించి మీడియాలో కథనాలు రావడంతో విచారణకు ఆదేశించాం. ఈ విషయాలను అంతర్గతంగా సమీక్షిస్తాం. పీసీబీ ప్రమాణాలు, నియమనిబంధనల మేరకు విచారణ కొనసాగుతుంది. ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, కథనాలను విశ్వసించవద్దని కోరుతున్నాం. ప్రస్తుతానికైతే పీసీబీ ఈ వ్యవహారంపై ఎలాంటి కామెంట్ చేయడం లేదు. అభిమానులు, వాటాదారులు అందరూ పీసీబీ నుంచి అధికారికంగా వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలి' అని అమిర్ మిర్ పేర్కొన్నాడు. కానీ ఆటగాళ్ల మొబైల్స్ లాక్కున్నారనే వార్తలపై అతను స్పందించలేదు.



# భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది





మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లకు మూడు గెలిచిన భారత్.. గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచింది. గ్రూప్-బీ రన్నరప్‌తో సెమీఫైనల్ మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-బీ రన్నరప్‌గా బంగ్లాదేశ్ నిలిచే అవకాశం ఉంది. అయితే ఆ జట్టుకు యూఏఈతో గట్టి పోటీ నెలకొంది. ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగే మ్యాచ్ ఫలితంతో భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో తేలిపోనుంది. గత చరిత్ర చూసుకున్నా.. ఫామ్ పరిశీలించినా.. భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. అయితే ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలిచినా.. ట్రోఫీ దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఎందుకంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ.. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) ఛైర్మన్ హోదాలో ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ గెస్ట్‌గా హాజరుకానున్నాడు. అతనే మహిళల ఆసియా కప్ 2026 విజేతకు ట్రోఫీ అందజేయనున్నాడు. ఈ విషయంపై అధికారిక సమాచారం లేకపోయినప్పటికీ.. చీఫ్ గెస్ట్ మోహ్సిన్ నఖ్వీనే అంటూ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. గతేడాది పురుషుల ఆసియా కప్ 2025 ఫైనల్ మోహ్సిన్ నఖ్వీ కారణంగా రసాభాసగా మారిన సంగతి తెలిపిందే. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్.. నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు నిరాకరించింది. మరోవైపు నఖ్వీ కూడా తనే ట్రోఫీని అందజేస్తానని పట్టుబట్టాడు. అంతేకాకుండా ట్రోఫీని తనవెంట తీసుకెళ్లిపోయాడు. దాంతో భారత ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే సంబరాలు చేసుకున్నారు. ఇప్పటికీ ఆ ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉంది. బీసీసీఐ ఎన్నిసార్లు డిమాండ్ చేసినా మోహ్సిన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. మహిళల ఆసియా కప్ ఫైనల్ అనంతరం కూడా ఇవే పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారత్ విజేతగా నిలిస్తే మాత్రం.. నఖ్వీ చేతుల మీదు టైటిల్ తీసుకోదు. అదే జరిగితే మరోసారి ట్రోఫీ లేకుండానే భారత్ విజేతగా స్వదేశానికి రావాల్సి ఉంటుంది. ఏం జరుగుతుందో చూడాలి. భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్.. సెమీస్ బెర్త్ కోసం తండ్లాడుతోంది. నేడు (సోమవారం) హాంగ్‌కాంగ్‌తో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే పాక్ సెమీస్ చేరనుంది. లేదంటే ఇంటిబాట పడుతోంది.

# సౌత్‌జోన్ కొంపముంచిన సిరాజ్

ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ ఆధిపత్యం చెలాయిస్తోంది. తిలక్ వర్మ సారథ్యంలోని సౌత్ జోన్‌తో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్స్‌లతో 270)తో డబుల్ సెంచరీతో సత్తా చాటగా.. కుమార్ కుశాగ్ర(132 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 101) సెంచరీతో చెలరేగాడు. శిఖర్ మోహన్(120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 85), అభిమన్యు ఈశ్వరన్(86 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 72) హాఫ్ సెంచరీలతో రాణించారు. వైభవ్ సూర్యవంశీ(37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 44) దూకుడుగా ఆడాడు. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురణ విజయ్(4/180) నాలుగు వికెట్లు తీయగా.. చామ మిలింద్, శ్రేయస్ గోపాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. షేక్ రషీద్‌కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. ముఖ్యంగా మహమ్మద్ సిరాజ్ తీవ్రంగా నిరాశపర్చాడు. 25 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీయకపోగా.. 5.60 ఎకానమీతో 140 పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం ఈస్ట్ జోన్‌కు కలిసొచ్చింది. దూకుడుగా ఆడిన ఆ జట్టు రెండు రోజుల పాటు పూర్తిగా బ్యాటింగ్ చేసి రికార్డ్ స్కోర్ అందుకుంది. దులీప్‌ట్రోఫీ ఫైనల్స్ చరిత్రలోనే ఇది రెండో అత్యధిక స్కోర్‌గా నిలిచింది. 1987 దులీప్ ట్రోఫీ ఫైనల్లో వెస్ట్ జోన్‌పై నార్త్ జోన్ 868 పరుగులు చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక స్కోర్‌గా కొనసాగుతోంది. తాజా ఫైనల్‌కు ముందు రెండు సార్లు మాత్రమే జట్లు 700 ప్లస్ స్కోర్లు చేశాయి. 1986లో సౌత్ జోన్.. 1991లో నార్త్ జోన్ 700 పరుగుల మార్క్‌ను అందుకున్నాయి. హాఫ్ సెంచరీకి చేరువైన అనుకూల్ రాయ్(45)ను షేక్ రషీద్ ఔట్ చేయగా.. షమీ, ఖురైషి సౌత్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. శ్రేయాస్ గోపాల్ ఈ జోడీని విడదీసాడు. ఖరేషి(40)ని క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ దూకుడుగా ఆడి జట్టు స్కోర్ 700 ధాటించాడు. అతనితో పాటు ముఖేష్ కుమార్(0)ను విజయ్ పెవిలియన్ చేర్చి ఈస్ట్ జోన్ భారీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దాంతో రెండో రోజు ఆట ముగిసింది.



# వరల్డ్ కప్‌లో భువీ కచ్చితంగా ఉండాల్సిందే..

## సెలక్టర్లకు మాజీ క్రికెటర్ విజ్ఞప్తి

భారత జట్టుకు విశేష సేవలందించిన సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌కు 2027 వన్డే ప్రపంచకప్‌లో అవకాశం కల్పించాలని భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా డిమాండ్ చేశారు. ఐపీఎల్ తో పాటు ఇటీవల ముగిసిన యూపీ టీ20 లీగ్‌లో భువీ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ క్రమంలోనే సెలెక్టర్లు భువీ పేరును పరిశీలించాలని రైనా సూచించారు. అక్టోబర్-నవంబర్ 2027లో సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల్లో వన్డే ప్రపంచకప్ జరగనుంది. ఆయా దేశాల్లో ఉండే వేగవంతమైన, స్వింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై భువనేశ్వర్ అనుభవం, బంతిపై అతనికున్న నియంత్రణ భారత జట్టు విజయాలకు ఎంతో కీలకంగా మారుతాయని రైనా అభిప్రాయపడ్డారు. యూపీ టీ20 లీగ్‌లో లక్నో ఫాల్కన్స్ జట్టు తరఫున ఆడిన భువనేశ్వర్ కుమార్ 11 మ్యాచుల్లో 14 వికెట్లు పడగొట్టారు. కేవలం వికెట్లే కాకుండా ఆయన వేసిన పొదుపైన బౌలింగ్ అందరినీ ఆకట్టుకుంది. మొత్తం 11 మ్యాచుల్లో ఆయన ఏకంగా 119 డాట్ బాల్స్




వేశారు. అంటే దాదాపు 20 ఓవర్ల పాటు ప్రత్యర్థి బ్యాటర్లకు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా కట్టిపడేసారు. అంతేకాకుండా కేవలం 6.11 ఎకానమీ రేటుతో పరుగులు ఇచ్చి తనలోని పదును ఇంకా తగ్గలేదని నిరూపించారు. బౌలింగ్‌లో స్వింగ్, వైవిధ్యంతో ప్రత్యర్థులను తిప్పలు పెట్టడంలో భువీ శైలి ప్రత్యేకం. భారత జట్టు రాబోయే రోజుల్లో యువత, అనుభవం కలయికతో ముందుకు వెళ్లాలని రైనా ఆకాంక్షించారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భువనేశ్వర్ కుమార్, మహమ్మద్ షమీల అనుభవానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో ఉన్నట్లే, బౌలింగ్ విభాగంలో ఈ ఇద్దరు సీనియర్ పేసర్లు కూడా గిల్ ప్రణాళికల్లో భాగం కావాలని తెలిపారు. ముగ్గురు లేదా నలుగురు స్పెషలిస్ట్ పేసర్లను ఎంపిక చేసే క్రమంలో భువీ అనుభవాన్ని విస్మరించకూడదని వివరించారు. ఇక మీరట్ మెవ్రిక్స్ జట్టును విజేతగా నిలిపిన రింకూ సింగ్ కెప్టెన్సీ టాలెంట్ పై కూడా రైనా ప్రశంసల జల్లు కురిపించారు. ఒత్తిడి సమయంలో రింకూ ప్రదర్శించిన వ్యూహాత్మక చతురత అద్భుతమని కొనియాడారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యం రింకూ సింగ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. దేశవాళీ టాలెంట్‌ను వెలికితీయడంలో యూపీ టీ20 లీగ్ ఎంతగానో తోడ్పడుతోందని కొనియాడారు.

# ఇద్దరూ ఒకే సిగరెట్ తాగుతూ..

## మరోసారి అడ్డంగా దొరికిపోయిన జయం రవి-కెనీషా

**చెన్నై, సెప్టెంబర్ 7 :** కోలీవుడ్ ప్రముఖ నటుడు జయం రవి (రవి మోహన్), సింగర్ కెనీషాతో కలిసి ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతోంది. గత కొన్ని రోజులుగా భార్య ఆర్తితో విడాకుల వ్యవహారం కోర్టులో నడుస్తుండగా, కెనీషాతో రవి సన్నిహితంగా ఉంటున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో ఊపందుకుంది. ఈ క్రమంలో వారిద్దరూ కలిసి ఉన్న సరికొత్త వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సదరు వీడియోలో జయం రవి, కెనీషాతో పాటు మరికొందరు ఒక గ్రూప్ మీటింగ్‌లో పాల్గొన్నట్లు కనిపిస్తోంది. ఆ తీవ్ర చర్చల సమయంలో జయం రవి సిగరెట్ తాగి, దానిని కెనీషాకు అందించడం, ఆమె కూడా దానిని పీల్చడం స్పష్టంగా నమోదైంది. గతంలో తమ మధ్య ఎలాంటి సంబంధం లేదని, విడాకులు పూర్తయ్యే వరకు నటనకు విరామం ఇస్తున్నానని ప్రకటించిన రవి.. ఇటీవల తిరుమల దర్శనంలోనూ, ఇప్పుడు ఈ వీడియోలోనూ కెనీషాతో కలిసి కనిపిస్తుండటంపై అభిమానులు, నెటిజన్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆరంభంలో జయం రవికి మద్దతు తెలిపిన పలువురు నెటిజన్లు, ఈ ఘటనలతో తమ అభిప్రాయం మారిపోయిందని విమర్శలు గుప్పిస్తున్నారు.







# ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పేస్తుందా?

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :** లేడీ సూపర్ స్టార్ గా తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న కథానాయిక అనుష్క శెట్టి. అరుంధతి, భాగమతి, బాహుబలి వంటి భారీ చిత్రాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న స్వీటీ గత కొంతకాలంగా వెండితెరకు.. మీడియా ప్రమోషన్లకు దూరంగా ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అమ్మడు నటించిన చిత్రాలు విడుదలవుతున్నా? ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అనుష్క నటనా జీవితానికి ముగింపు పలకాలనే ఆలోచనలో ఉన్నట్లు పరిశ్రమలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అనుష్క మలయాళంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ జానపద చిత్రం -కథనార్: ది విల్డ్ సోర్సరర్- లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం ఫలితంపైనే అనుష్క భవిష్యత్తు ప్రణాళికలు ఆధారపడి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో క్రమం తప్పకుండా వరుస సినిమాలు చేసిన అనుష్క ఇటీవల కాలంలో కథల ఎంపికలో అత్యంత జాగ్రత్త వహిస్తున్నారు. మనసుకు నచ్చిన, ప్రాధాన్యత ఉన్న పాత్రలకు మాత్రమే ఓకే చెబుతున్నారు. అయితే సినిమాల ఎంపిక తగ్గించడంతో పాటుగా ఆయా చిత్రాల ప్రచార వేదికలపై ఆమె కనిపించకపోవడం అభిమానులను కలవరపెడుతోంది. పర్సనల్ లైఫ్, ఫిట్‌నెస్ లైఫ్‌స్టైల్‌పై దృష్టి పెట్టడం వల్లే ఆమె గ్లామర్ ప్రపంచానికి కాస్త విరామం ఇచ్చారని కొందరు విశ్లేషిస్తున్నారు. -కథనార్- చిత్రం పాన్-ఇండియా స్థాయిలో అత్యంత అట్టహాసంగా విడుదల కానుంది. ఈ సినిమా కనుక బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధిస్తే అనుష్క కెరీర్‌ను మరికొంత కాలం కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ ప్రాజెక్ట్ ఫలితం తారుమారైతే స్వీటీ పూర్తిస్థాయిలో చిత్ర పరిశ్రమకు గుడ్ బై చెప్పి, వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. అనుష్క శెట్టి గ్లామర్ పాత్రలకే పరిమితం కాలేదు. లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద హీరోలకు సమానంగా వసూళ్లు రాబట్టిన నటి. టాలీవుడ్, కోలీవుడ్‌లలో తిరుగులేని ఇమేజ్‌ను సంపాదించుకున్న అమ్మడు పరిశ్రమను వీడుతున్నారనే వార్తలు అభిమానులను నిరాశకు గురి చేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా స్వీటీ తిరిగి పూర్తిస్థాయిలో సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఏది ఏమైనా? -కథనార్- చిత్రం విడుదలయ్యే వరకు ఈ ప్రచారాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. అనుష్క నిర్ణయం ఏదైనా? అమ్మడు మళ్లీ పూర్వ వైభవంతో వెండితెరపై మెరవాలని.. మరిన్ని పవర్‌ఫుల్ పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని అభిమానులు మాత్రం బలంగా కోరుకుంటున్నారు.

# 'రంభ ఊర్వశి మేనక' కలెక్షన్స్ జోరు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :** ఈమధ్య సీరియస్ రోల్స్, ఇంటెన్స్ డ్రామాలు చేస్తూ వచ్చిన అల్లరి నరేష్.. మళ్లీ తన సొంత ట్రాక్ అయిన ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ వైపు అడుగులేశారు. ఆడియన్స్ కూడా ఆయన నుంచి ఎక్కువగా ఆశించేది వింటేజ్ కామెడీ టైమింగే కావడంతో లేటెస్ట్ మూవీ 'రంభ ఊర్వశి మేనక'పై రిలీజ్ ముందే క్రేజ్ ఏర్పడింది. ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో అవుట్ అండ్ అవుట్ కామెడీ ట్రాక్ లో ఈ సినిమా థియేటర్లలోకి వచ్చింది. మొదటి రోజు మార్నింగ్ షోస్ పడగానే కొన్ని చోట్ల మిక్స్‌డ్ టాక్ వినిపించినప్పటికీ, సినిమాలోని ఫన్ ఎలిమెంట్స్ కుర్రాళ్లతో పాటు ఫ్యామిలీస్ కి కనెక్ట్ అవ్వడం మొదలైంది. రొటీన్ కమర్షియల్ మాస్ సినిమాల మధ్య కాసేపు రిలాక్స్ అయి హాయిగా నవ్వుకునే స్పేస్ దొరకడంతో నెమ్మదిగా మౌత్ టాక్ బలపడింది. ముఖ్యంగా శనివారం, ఆదివారం నాటికి బీ, సీ సెంటర్లలో కూడా ఈవెనింగ్ షోలకు ఆక్యుపెన్సీలు మెరుగవుతూ వచ్చాయి. ఈ పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్ బాక్సాఫీస్ కలెక్షన్లలో కనిపిస్తోంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 4.40 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి డీసెంట్ వీకెండ్ నంబర్లను నమోదు చేసింది. మిక్స్‌డ్ టాక్ ప్రభావం కొంత ఉన్నప్పటికీ ఈ స్థాయి వసూళ్లు రాబట్టడం మామూలు విషయం కాదు. అల్లరి నరేష్ టైమింగ్‌కి, కామెడీ జానర్‌కు ఇంకా ఆ క్రేజ్ తగ్గలేదని చెప్పవచ్చు. సినిమాలో స్వర్గలోకం నేపథ్యం, రంభ, ఊర్వశి, మేనకలుగా కనిపించిన నటీమణులతో నరేష్ చేసిన కామెడీ ట్రాక్స్ కూడా హైలెట్ అయ్యాయి. లాజిక్కులు వెతక్కుండా కేవలం ఎంటర్‌టైన్‌మెంట్‌ను మాత్రమే ఎంజాయ్ చేసే ఆడియన్స్‌కు ఈ కంటెంట్ బాగా రీచ్ అయింది. చైతన్ భరద్వాజ్ అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆ ఫన్ మూడ్‌ను నిలబెట్టడంలో సాయపడ్డాయి. కథ పరంగా కన్ఫ్యూజన్ ఏమి లేదు, రన్‌టైమ్ తక్కువగా ఉండటం, నరేష్ తన మార్క్ కామెడీతో నెట్టుకురావడం సినిమాకు కలిసొచ్చింది. దర్శకుడు చంద్రమోహన్ నరేష్ కు తగ్గ ఫన్ ను క్రియేట్ చేశాడు, హాస్య మూవీస్ నిర్మాణ విలువలు సినిమా స్కేల్‌కు సరిపోయేలా ఉన్నాయి. పెద్దగా హంగులకు పోకుండా కేవలం ఫన్ ట్రాక్స్‌పైనే ఫోకస్ పెట్టడంతో బాక్సాఫీస్ వద్ద వీకెండ్ వరకు ఒక మోస్తరుగా నిలబడగలిగింది. అయితే చిత్రానికి అసలైన ఛాలెంజ్ సోమవారం నుంచే మొదలవుతోంది. వీకెండ్‌లో వచ్చిన డీసెంట్ నంబర్స్ మిక్స్‌డ్ టాక్ ఉన్న సినిమాలకు వర్కింగ్ డేస్‌లో కంటిన్యూ అవ్వడం అంత సులువు కాదు. ఇక రాబోయే రోజుల్లో ఈ సినిమా ఎలాంటి కలెక్షన్స్ అందుకుంటుందో చూడాలి.







# 'ది ప్యారడైజ్' విడుదల వాయిదా?




**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :** నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'ది ప్యారడైజ్' క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం. ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 1కి వాయిదా పడితే, బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొననుంది. నాగవంశీ నిర్మించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' అక్టోబర్ 2న విడుదల కానుంది. విశేషమేమిటంటే, 'ది ప్యారడైజ్' నైజాం హక్కుల్లో నాగ వంశీకి 25 శాతం వాటా ఉంది. గతంలో 'ది ప్యారడైజ్' కోసం ఆయన తన సినిమాను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ రెండు చిత్రాలు దాదాపు ఒకేసారి విడుదలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అక్టోబర్ రెండో వారంలో విజయ్ దేవరకొండ 'రణబాలి', సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' వంటి పెద్ద సినిమాలు కూడా రానుండటంతో పోటీ మరింత తీవ్రంగా ఉండనుంది. ఇప్పటికే 'ప్యారడైజ్' సినిమా రెండుసార్లు వాయిదా పడింది. తొలుత మార్చి 26, ఆ తర్వాత ఆగస్టు 21 తేదీలను ప్రకటించి, చివరకు సెప్టెంబర్ 24ను ఖరారు చేశారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడితే ఇది మూడోసారి అవుతుంది. ఇది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644